ఆంధ్రజ్యోతి
**** ఇఫ్తార్ : 6.30| సహర్ : 5.05 (బుధవారం)
ANDHRAJYOTHY



నల్లగొండ

5

మంగళవారం 11 మార్చి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.112	175	200
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.0 । కనిష్ఠం 20.4

నారసింహుడికి చక్రతీర్థ స్నానం

స్వామివారిని దర్శించుకున్న గవర్నర్



యాదగిరిగుట్ట ఆలయంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ●7లో..

ప్రపంచ స్థాయి వైద్య కళాశాలగా ఎయిమ్స్

- పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి
- అట్టహాసంగా ఎయిమ్స్ ఐదో వార్షికోత్సవం



బీబీనగర్ ఎయిమ్స్ ఐదో వార్షికోత్సవంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ●7లో..



క్షణ క్షణం ఉత్కంఠ

- ప్రణయ్ హత్యకేసులో నల్లగొండ కోర్టు సంచలన తీర్పు
- ప్రధాన నిందితుడు సుభాష్ శర్మకు మరణశిక్ష
- ఆరుగురికి జీవిత ఖైదు, జరిమానా
- కోర్టు వద్ద ఉద్రిక్తత
- శిక్ష పడిన నిందితుల కుటుంబ సభ్యుల కన్నీరు

నల్లగొండ కోర్టు వద్ద సందడి



ప్రణయ్ (ఫైల్)



మారుతీరావు (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ప్రణయ్ పరువు హత్య కేసు తుది తీర్పు సందర్భంగా సోమవారం నల్లగొండ కోర్టు వద్ద క్షణ క్షణం ఉత్కంఠ నెలకొంది. కోర్టు వద్ద నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహించారు. ఎవ్వరినీ కోర్టు సముదాయంలోకి అనుమతించని పోలీసులు కోర్టు వాయిదాలు ఉన్న వారిని మాత్రమే లోనికి పంపారు. పట్టణంతో పాటు మిర్యాలగూడ నుంచి వచ్చిన ప్రజలు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు, న్యాయవాదులతో కోర్టు ప్రాంగణం కిక్కిరిసింది. మీడియా ప్రతినిధులు సైతం పెద్ద సంఖ్యలో కోర్టు వద్దకు చేరుకోగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు ఉదయం 11.10 గంటలకు నిందితుల్లో ఒకడైన అస్గర్ అలీని నల్లగొండ కోర్టుకు తీసుకువచ్చారు. అనంతరం 11.50 గంటలకు ఏ-2గా ఉన్న సుభాష్ శర్మను కోర్టులో హాజరుపరిచారు. అప్పటికే ఇతర నిందితులు కూడా రాగా, మధ్యాహ్నం సమయంలోగా న్యాయమూర్తి తీర్పును వెలువరించారు. జీవిత ఖైదు శిక్ష పడినట్లు తెలియడంతో అక్కడికి వచ్చిన ● మిగతా 7వ పేజీలో..



రోదిస్తున్న శ్రవణ్ కుటుంబసభ్యులు

● పూర్తి వివరాలు ప్రధాన సంచిక 10లో..

కోర్టు తీర్పు కుల దురహంకారులకు చెంపపెట్టు

ప్రణయ్ తండ్రి పెరుమాళ్ల బాలస్వామి



నివాళులర్పిస్తున్న తల్లి ప్రేమలత, తండ్రి బాలస్వామి, సోదరుడు

మిర్యాలగూడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు ఇచ్చిన తీర్పు కుల దురహంకారులకు చెంపపెట్టు అని ప్రణయ్ తండ్రి పెరుమాళ్ల బాలస్వామి అన్నారు. సోమవారం ప్రణయ్ కేసు తీర్పు అనంతరం భార్య ప్రేమలత, చిన్న కుమారుడు అజయ్‌తో కలిసివెళ్లి ప్రణయ్ సమాధిపై పుష్పాంజలి ఘటించి కన్నీటిపర్యాంతమయ్యారు. అనంతరం ఇంటి వద్ద విలేకరులతో మాట్లాడుతూ, ఒక్క ప్రణయ్ కోసమే కాదు సమాజంలో మరెవరూ కులం, పరువు కోసం పిల్లలను, ఇతరుల పిల్లలను చంపడం లాంటి ఘటనలు - మిగతా 6వ పేజీలో...

నిందితుడు సుభాష్ శర్మకు మరణ శిక్ష : ఎస్పీ



నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ వన్‌టౌన్ పరిధిలో కులాంతర వివాహం చేసుకున్న కారణంగా హత్యకు గురైన ప్రణయ్ కేసులో నిందితులకు శిక్ష విధిస్తూ జిల్లా రెండో అదనపు ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి రోజారమణి తీర్పు ఇచ్చారని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2018 జనవరి 31న అమృత, ప్రణయ్‌లు కులాంతర వివాహం చేసుకోగా, అది నచ్చని ఆమె తండ్రి మారుతీరావు కిరాయి హంతకులకు సుపారీ ఇచ్చి ప్రణయ్‌ను హత్య చేసేందుకు ప్రణాళిక చేశారన్నారు. ఈ మేరకు 2018 సెప్టెంబరు 14న మిర్యాలగూడలోని ఓ ఆస్పత్రి వద్ద మాటు వేసిన నిందితుడు సుభాష్ శర్మ పదునైన కత్తితో ప్రణయ్‌పై దాడి చేసి...

- మిగతా 6వ పేజీలో...

అభ్యసన సామర్థ్యాలపై అధ్యయనం

- మూడు రోజులు 50 పాఠశాలల్లో
- రెండో తరగతి విద్యార్థుల సృజనాత్మకతను అంచనా వేసే లక్ష్యం



భువనగిరి టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగంతో పాటు అన్ని వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపిన కరోనా అనంతరం మొదటి బ్యాచ్‌గా పరిగణించే రెండో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు ఎన్‌సీఈఆర్‌టీ చేపట్టిన అధ్యయనం జిల్లాలో సోమవారం ప్రారంభమంది. జిల్లాలో ఎంపిక చేసిన 50 ప్రభుత్వ పాఠశాలల్లో మూడు రోజులపాటు ఈ సర్వే కొనసాగనుంది. ప్రాథమిక విద్యలోనే విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించి లోపాలను అధిగమించేలా ప్రణాళికల రూపకల్పనకు ఈ సర్వే వేదిక కానుంది. ఇప్పటికే అమలులో ఉన్న తొలిమెట్టులో భాగంగా ఈ సర్వే కొనసాగనుంది.

50 పాఠశాలలు

జిల్లాలో 484 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో రెండో తరగతి 3,018 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే సర్వే కోసం ఎన్‌సీఈఆర్‌టీ ప్రతీ జిల్లాలో 50 పాఠశాలలను ఎంపిక చేసింది. ప్రతి జిల్లాలో 50 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌ను అందుకు నియమించింది. ఈనెల 10, 11, 12వ తేదీల్లో సర్వే కొనసాగనుంది. ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన ప్రశ్నావళి ఆధారంగా ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్ రెండో తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేస్తారు. మీడియం ఆధారంగా తెలుగు, ఇంగ్లీష్ పుస్తకం చదవడం, రాయడం, అక్షరాలు, అంకెల గుర్తింపు, అవగాహన తదితర సామర్థ్యాలను అంచనా వేస్తారు. ప్రతీ పాఠశాలలో ఎనిమిది మంది విద్యార్థులను మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటారు. అంతకు తక్కువగా విద్యార్థులు ఉంటే అందరినీ సర్వే ఆధారంగా ప్రశ్నిస్తారు.

పకడ్బందీగా సర్వే



జిల్లాలో రెండో తరగతి విద్యార్థుల్లో సామర్థ్యాలను అంచనా వేసేందుకు చేపట్టిన సర్వే పకడ్బందీగా సాగుతోంది. విద్యార్థుల చదువు, గుర్తింపు, అవగాహన తదితర సామర్థ్యాలను ఈ సర్వే ద్వారా అంచనా వేస్తారు. సర్వేలో వెల్లడైన అంశాల ఆధారంగా విద్యాశాఖలో ఎన్‌సీఈఆర్‌టీ సంస్కరణలు, నూతన విధానాలను అమలు చేసే అవకాశం ఉంది. అయితే పిల్లలపై పెనుప్రభావం చూపుతున్న స్మార్ట్‌ఫోన్‌లను తల్లిదండ్రులు ఇవ్వకుంటే మంచిది.

- కె.సత్యనారాయణ, డీఈవో

సర్వేను జిల్లా విద్యాశాఖ పర్యవేక్షిస్తుంది. సోమవారం తెలుగు సామర్థ్యాల పరిశీలన పూర్తి కాగా, 11న ఆంగ్లం, 12న గణితం సర్వే కొనసాగనుంది.

సెల్ ఫోన్స్‌కు బానిసలుగా

బాల్యానికి సెల్ ఫోన్స్ సంకెళ్లుగా మారాయి. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు వీలున్నపుడల్లా సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడటం, ఇన్‌స్టా రీల్స్, యూట్యూబ్ షార్ట్స్ చూడటం పరిపాటిగా మారుతోంది. తల్లిదండ్రులు ఇంటిలో ఉన్న సమయం అంతా చిన్నపిల్లల చేతుల్లోనే ఫోన్లు ఉంటున్నాయి. పిల్లలు అన్నం తినాలన్నా, ఇంటి పనులకు ఆటంకం కలిగించవద్దన్నా, చివరికి వారికి ఆలనాపాలనా శ్రమ తప్పాలన్నా పిల్లలకు స్మార్ట్‌ఫోన్ ఇస్తే సరిపోతుంది అనే భావనలో కొందరు తల్లిదండ్రులు ఉంటున్నారు. అక్షరజ్ఞానం రాకముందే పిల్లలకు స్మార్ట్‌ఫోన్‌లో గేమ్స్ ఆడటం, కార్టూన్స్, రీల్స్ చూడటంపై అవగాహన వస్తుండటం పలు అనర్థాలకు కారణం అవుతోంది. ఈ నేపథ్యంలో రెండో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న సర్వేలో విద్యాసామర్థ్యాల సృజనాత్మకతపై అధికార వర్గాలలో ఆసక్తి నెలకొన్నది. అయితే పిల్లలు సెల్‌ఫోన్‌కు బానిస కావడానికి తల్లిదండ్రుల వైఖరే కారణమని, దీంతో పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదులను పరిష్కరించాలి: కలెక్టర్



సైకిళ్లు పంపిణీ చేసి ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 'ప్రజావాణి'లో వచ్చిన ప్రజల ఫిర్యాదులను ఎప్పటికప్పుడూ పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకొని మాట్లాడారు. జిల్లా స్థాయితో పాటు మండల, గ్రామ స్థాయి వరకు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించాలన్నారు. వ్యక్తిగత విషయాలకు సంబంధించినవి, భూములకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని వీటిపై ఫిర్యాదుదారులకు స్పష్టమైన వివరణ ఇవ్వాలన్నారు. ఒకవేళ పరిష్కారం కాకపోతే ఎందుకు కావడం లేదో తెలియజేయాలన్నారు. 'ప్రజావాణి'కి జిల్లా అధికారులంతా తప్పక హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, ఇన్‌చార్జి డీఆర్‌వో అశోక్‌రెడ్డి,జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్ కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థినులు కష్టపడి చదవాలి...

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్): విద్యార్థినిలు కష్టపడి చదివి ఆర్థికంగా వారి కాళ్లపై వారు నిలబడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమకూర్చిన సైకిళ్లను కలెక్టర్ సోమవారం పంపిణీచేశారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఆర్‌పీ.రోడ్ బాలికల ఉన్నత పాఠశాల, బోయవాడ రామగిరి బాలికల ఉన్నతపాఠశాల, మాల్‌బౌలి పాఠశాలకు చెందిన 30మంది విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. నకిరేకల్‌కు చెందిన సరితకు పేపర్ ప్లేట్ల యూనిట్ ఏర్పాటుకు రూ.1.90లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఐటిపాముల బ్యాంకు ద్వారా వెంకన్న, మణెమ్మ అనే ఇద్దరు రైతులకు రూ.50లక్షల విలువైన రెండు హార్వెస్టర్లు అందజేశారు. అయిటిపాముల బ్యాంకు ద్వారా ఎనిమిది స్వయం సహాయక మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద రూ.1.50కోట్లు విలువైన చెక్కులు, బీసీ బాలికలు, మైనార్టీ హాస్టల్ విద్యార్థినులకు 20 శానిటరీ న్యాప్కిన్ ఇన్సిలేటర్లు అందజేశారు. దీంతోపాటు మరుగుదొడ్ల నిర్మాణానికి సీఎస్ఆర్ నిధుల ద్వారా చేపట్టేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందుకు వచ్చింది. కార్యక్రమంలో ఎస్‌బీఐ డీజీఎం వినోద్ కుమార్‌సిన్హా, రీజినల్ మేనేజర్ అలీముద్దీన్, చీఫ్ మేనేజర్ అంజనేయులు, జిల్లా ఎల్డీఎం శ్రామిక్, ఏపీడీ శారద, ఎంఈవో అరుంధతి, తదితరులు పాల్గొన్నారు.

'గ్రీవెన్స్‌డే'తో సమస్యలకు పరిష్కారం

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



'గ్రీవెన్స్‌డే' ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 'గ్రీవెన్స్‌డే'తో బాధితుల సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన 'గ్రీవెన్స్ డే'లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన 45 మంది అర్జీదారుల ఫిర్యాదులు తీసుకొని వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీస్‌శాఖను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా పోలీస్ అధికారులు కృషి చేయాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూసి వారిలో భరోసా కల్పించాలన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరిచి నిత్యం పర్యవేక్షిస్తామన్నారు. అదేవిధంగా పోలీస్ స్టేట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్, చలివేంద్రాన్ని ఎస్పీ ప్రారంభించారు. జిల్లా పోలీస్‌శాఖలో విధులు నిర్వహిస్తూ మృతిచెందిన పోలీస్, హోంగార్డుల కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్‌ఐ సంతోష్, ఆర్ఎస్ఐ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పంటలు ఎండిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

- పెండింగ్ రుణమాఫీ, రైతు భరోసాను జమచేయాలి
- రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం



నెర్మట గ్రామంలో ఎండిన వరి పంటలను పరిశీలిస్తున్న శ్రీశైలం

చండూరురూరల్, మార్చి10(ఆంధ్రజ్యోతి): వరి పంట ఎండిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.30వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. చండూరు మండల పరిధిలోని నెర్మట గ్రామంలో సోమవారం ఆయన ఎండిన పొలాలను పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో సుమారు 20 మంది రైతుల పొలాలు బోర్లు అడుగంటి సాగు చేసిన పంట పూర్తిగా ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అప్పు చేసి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు గ్రామాలను సందర్శించి పంటలు, రైతుల వారీగా పరిశీలించి నష్టపరిహారం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఆయన కోరారు. వరికి ఎకరాకు రూ.30 వేలు, మిర్చి పంటకు రూ. 40వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న రైతు రుణమాఫీ, రైతు భరోసా నిధులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని అన్నారు. రైతులు అప్పు చేసి కష్టపడి పండించిన పంటలు చేతికొచ్చే సమయానికి నీళ్లు లేక ఎండిపోతుండటంతో ఆర్థికంగా, మానసికంగా కుంగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిలిచిపోయిన రుణమాఫీ, రైతు భరోసాను ఇవ్వాలని కోరారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా పార్లమెంట్‌లో చట్టం చేయాలని, వ్యవసాయ మార్కెట్ల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్కరణలను ఉపసంహరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు జెర్రిపోతుల ధనంజయ, రైతు సంఘం మండల, అధ్యక్ష కార్యదర్శులు కొత్తపల్లి నరసింహ, ఈరటి వెంకటయ్య, నాయకులు ఈరగట్ల నరసింహ, యాదయ్య, రాములమ్మ, బొమ్మరగోని నరసింహ, యాదయ్య, నారపాక నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పచ్చని మొక్కలకు నిప్పు

అగ్నికి ఆహుతైన హరితహారం మొక్కలు

మర్రిగూడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్లకు ఇరువైపులా నాటిన చెట్లు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. మర్రిగూడ మండలంలోని తిరుగండ్లపల్లి నుంచి మాల్‌కు వెళ్లే రోడ్డు పక్కన హరితహారం పథకంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. వాటికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడం వల్ల సుమారు అర కిలోమీటర్ వరకు చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఇలాంటివి తరచూ సంఘటనలు జరుగుతున్నాయి. వేల రూపాయలు వెచ్చించి మొక్కలు నాటి పెంచినా నీడనిచ్చే చెట్లు ఇలాంటి సంఘటనలు జరిగి పూర్తిగా దహనమవుతున్నాయి. అధికారులు స్పందించి హరితహారం మొక్కలను పర్యవేక్షించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు వెంట అగ్నికి ఆహుతి అయిన హరితహారం మొక్కలు

మూసీ ఎత్తిపోతల ద్వారా చెరువులు నింపాలి

కేతేపల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టుపై ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి మండలంలోని ఆయకట్టేతర గ్రామాల చెరువులు, కుంటలు నింపి రైతులకు సాగునీటిని అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు డిమాండ్ చేశారు. సీపీఎం చేపట్టిన ప్రజా సమస్యలపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండకిందిగూడెం గ్రామంలో ఆయన పర్యటించి ప్రజలు, రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక రైతుల కోరిక మేరకు గ్రామశివారు నుంచి వెళ్తున్న నీరు పారని ఏఎమ్మార్పీ కాల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూసీ ప్రాజెక్టు ఉన్నా మండలంలోని మెట్ట గ్రామాలైన గుడివాడ, ఇప్పలగూడెం, కొర్లపహాడ్, ఇనుపాముల, కొండకిందిగూడెం, బండపాలెంకు సాగునీరు అందని పరిస్థితి నెలకొందన్నారు. మూసీ ప్రాజెక్టుపై ఎత్తిపోతల పథకం ఏర్పాటుచేసి దీని ద్వారా ఆయా గ్రామాల చెరువులు, కుంటలు నింపాలన్నారు. అందుకు ఉద్యమిస్తామని తెలిపారు.

చి'వరి'కి మిగిలింది కన్నీరే



- ఎండిన పైరు పశువులకు మేతగా
- ట్యాంకర్లతో నీటిని పోసి పంటలను కాపాడుతున్న రైతులు



యాదాద్రి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోఎండిన వరి చేను

మునగాల రూరల్/ సంస్థాన్‌నారాయణపురం/ మోటకొండూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అరుగాలం కష్టపడి పండించిన పంటలు వేసవికి ముందే నిలువునా ఎండిపోతున్నాయి. దీంతో రైతులు పొట్టదశలో ఉన్న తమ పంటను కాపాడుకోవడానికి నానా కష్టాలు పడుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన కొండ సత్తయ్య తనకున్న భూమిలో ఎకరం వరి సాగు చేశాడు. నెల రోజుల నుంచి బోరులో నీటి మట్టం తగ్గింది. దీంతో బోరు ద్వారా వచ్చే నీళ్ల పొలానికి సరి పోవడం లేదు. ఈ క్రమంలో పొలం వాడిపోతోంది. చేతికొచ్చిన సమయంలో వరి ఎండిపోతుండడంతో రైతు పంటను కాపాడుకోవడానికి రెండు రోజులకోసారి ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చి పొలానికి పారిస్తున్నాడు. ఒకసారి ట్యాంకర్ నీటిని పోస్తే రూ.700 ఖర్చవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. 15 రోజులుగా టాంకర్ల ద్వారా నీటిని తెచ్చి వరి చేనుకు పోసి పంటను కాపా డుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఎకరం పొలం సాగు చేయడానికి రూ.70వేలు ఖర్చువుతుందని చెప్పాడు. తమలాంటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సత్తయ్య కోరారు.

మూడు రోజులకో ట్యాంకర్

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రానికి చెందిన బాల్ద శ్రీనివాస్ తనకున్న 3ఎకరాల్లో ఒక్క ఎకరంలో వరి సాగు చేశాడు. గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు, బావులోంచి నీళ్ల రావడం లేదు. దీంతో 10 గుంటలు ఎండిపోయింది. బోరు లోంచి నీరు తగ్గి దారాల వస్తుండడంతో పొట్టదశలో ఉన్న 30 గుంటల పొలాన్ని కాపాడుకోవడానికి ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నాడు. మూడు రోజులకు ఒకసారి ట్యాంకర్ ద్వారా నీరు పెడుతున్నట్లు రైతు తెలిపాడు.



మోటకొండూరులో ట్యాంకర్‌తో పొలానికి నీరు అందిస్తున్న రైతు శ్రీనివాస్

గాలయ్యది దీన పరిస్థితి

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన మరో రైతు నూకం గాలయ్యది దీన పరిస్థితి. తనకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. తనకున్న భూమిలో వరి సాగు చేశాడు. మొదట బోరు బాగానే నీరు పోసింది. కొన్ని రోజుల నుంచి బోరులో నీటిమట్టం తగ్గిపోయింది. బోరులో నీరు తగ్గిపోవడంతో సాగుచేసిన వరి చేను వాడు పట్టింది. ఎండిపోతున్న పంటను కాపాడుకునేందుకు రైతు గాలయ్య విశ్వ ప్రయత్నాలు చేశాడు. కొన్ని రోజులు ట్యాంకర్ ద్వారా నీటిని తెప్పించి పం టలు రక్షించే ప్రయత్నం చేశాడు. అయినా వరి పంటకు పూర్తిస్థాయిలో నీరు అందక వరి చేను ఎండిపోయింది. కళ్లెదుటే పంట ఎండిపోవడంతో రైతుకు దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. తప్పని పరిస్థితుల్లో ఎండిపోయిన పంట చేలో తనకున్న పశువులను మేపుతున్నాడు. పైరు ఎండిపోయి నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతు గాలయ్య ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సూర్యాపేట జిల్లాలో

సూర్యాపేట జిల్లాలోని మోతె, మునగాల మండలాల్లోని నాన్ కెనాల్ ఆయకట్టు గ్రామాల్లో వరి పంట ఎండిపోయే దశకు చేరుకుంది. ఎస్సారెస్పీ జలాలను విడుదల చేయాలని స్థానిక రైతులు డిమాండ్ చేస్తున్నారు. మోతె మండలంలోని అన్ని గ్రామాలు, మునగాల మండలంలోని నాన్ కెనాల్ ఆయకట్టు గ్రామాలైన రేపాల, నర్సింహులగూడెం, జగన్నాథపురం, విజయరాఘవపురం, సీతానగరం, కలకోవ రైతులు ఎస్సారెస్పీ జలాలపై ఆధారపడి యాసంగి సీజన్‌లో అధిక మొత్తంలో వరిని సాగు చేశారన్నారు. ప్రస్తుతం నీరు లేక పొట్ట దశలో ఉన్న వరి పైర్లు నీరు లేక ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ ప్రాంతాలకు నీటిని విడుదల చేసి నాన్ కెనాల్ ఆయకట్టు రైతులను ఆదుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) నీరు రాక పైరు ఎండిపోయిందని మునగాల మండలం నేలమర్రి గ్రామానికి చెందిన కౌలు రైతు బట్టిపల్లి సుందరయ్య వినూత్నంగా నిరసన తెలిపారు. ఎస్సారెస్పీ నీరు రాక ఎండిపోయిన పొలంలో ద్విచక్ర వాహనంతో పలుమార్లు చక్కర్లు కొట్టి వినూత్న రీతిలో నిరసన తెలిపాడు. సాగు కోసం రూ.2లక్షలు అప్పు తెచ్చి సాగు చేశానని, పెట్టిన పెట్టుబడి కూడా రాక అప్పుల పాలయ్యాని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిపోయిన పొలంలో గొర్రెలు మేపుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా తమ ప్రాంతానికి ప్రభుత్వం సాగు నీరందించి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.



మునగాల మండలం నేలమర్రి గ్రామంలో కౌలు రైతు సుందరయ్య సాగు చేసిన వరి పైరు ఎండిపోవడంతో మేత మేస్తున్న గొర్రెలు

చేను ఎండిందని కౌలు రైతు ఆత్మహత్య



నరసింహ(ఫైల్)

రామన్నపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎండిన వరి చేనును చూసి కౌలురైతు ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురంలో ఈ ఘటన జరిగింది. ఎస్‌ఐ మల్లయ్య, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మోట నర్సింహ(50) 14ఎకరాలను కౌలుకు తీసుకుని వరి సాగుచేశాడు. నీరు లేక ఐదు ఎకరాల పొలం ఎండింది. ప్రైవేటువ్యక్తుల వద్ద రూ.15లక్షల వరకు అప్పులు చేశాడని గ్రామస్థులు తెలిపారు. నర్సింహకు ఇద్దరు కుమార్తెలు కాగా పెద్ద కుమార్తె వివాహం చేశాడు. పంట ఎండుతుండడంతో మనస్తాపం చెంది నర్సింహ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా రైతు బీమా మాదిరే కౌలు రైతు నరసింహ కుటుంబానికి ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందించి దుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నరసింహ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రైతు సంఘం ఆధ్వర్యంలో సందర్శించి నివాళులర్పించారు.

నిందితుడు సుభాష్‌శర్మకు మరణశిక్ష : ఎస్పీ

(5వ పేజీ తరువాయి)

కిరాతకంగా నరకడంతో అక్కడికక్కడే చనిపోయాడన్నారు. దీనిపై మిర్యాలగూడ వన్‌టౌన్ పీఎస్‌లో ప్రణయ్ తండ్రి పెరుమాళ్ల మారుతీరావు బాలస్వామి ఫిర్యాదు మేరకు మొత్తం ఎనిమిది మంది నిందితులను గుర్తించి కేసులు నమోదు చేశామన్నారు. అనంతరం దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా, ఐదేళ్ల పాటు కొనసాగిన వాదోపవాదనల అనంతరం ఏ-1 మారుతీరావు ఆత్మహత్య చేసుకుని మృతిచెందగా, మిగిలిన నిందితుల్లో ఏ-2గా ఉన్న సుభాష్ శర్మకు ఉరిశిక్ష, రూ.15వేల జరిమానా, మిగతా ఆరుగురు మహ్మద్ అస్గర్‌అలీ, అబ్దుల్ భారీ, అబ్దుల్ కరీం, తిరునగరి శ్రవణ్, సముద్రాల శివ, ఎంఏ.నిజాంకు జీవిత ఖైదు, రూ.10వేల జరిమానా విధించారని వివరించారు. ఈ కేసులో సరైన ఆధారాలు సేకరించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసి నిందితులకు శిక్షపడేలా విచారణ చేసిన నాటి ఇన్వెస్టిగేసన్ ఆఫీసర్, మిర్యాలగూడ డీఎస్పీ శ్రీనివాస్, ఎస్‌ఐ సుధీర్‌కుమార్, ప్రస్తుత డీఎస్పీ రాజశేఖరరాజు, వన్‌టౌన్ సీఐ పీఎన్‌డీ.ప్రసాద్, ఎస్‌ఐ వీరస్వామి, ఏఎస్‌ఐ మధుసూదన్, లైజన్ అధికారులు పాక నరేందర్, ఎన్.మల్లిఖార్జున్‌ను ఎస్పీ అభినందించారు.

కోర్టు తీర్పు కుల దురహంకారులకు చెంపపెట్టు

(5వ పేజీ తరువాయి)



ప్రణయ్ సమాధివద్ద రోదిస్తున్న తల్లి దండ్రులు ప్రేమలత, బాలస్వామి

జరగకుండా ఉండేందుకు ఆరేళ్లుగా న్యాయం కోసం ఎదురుచూశామన్నారు. ఈ తీర్పు పరువు కోసం హత్యలు చేసి తప్పించుకోవచ్చు అనే వారికి గుణపాఠం నేర్పుతుందన్నారు. కుల అహంకారంతో హత్య చేయడంతో చేతికి అంది వచ్చిన 23 ఏళ్ల నా కుమారుడు ప్రణయ్ తమకు దూరమయ్యాడని విలపించారు. అమృతకు భర్త, తన మనవడికి తండ్రి లేకుండా పోయాడని వాపోయారు. ఆత్మహత్య చేసుకుని మారుతీరావు, హత్య చేసి సుభాష్ శర్మ, ఇతర నిందితులకు శిక్షకు గురై కుటుంబాల్లో వ్యధను మిగిల్చిందన్నారు. సమస్య ఎదురైనప్పుడు సామరస్యంగా పరిష్కరించుకుంటే ఇందరి కుటుంబాల్లో ఇంతటి విషాదం ఉండేది కాదన్నారు. అప్పటి ఎస్పీ రంగనాథ్ ఆధ్వర్యంలో డీఎస్పీ శ్రీనివాస్ నేతృత్వతంలో అన్ని ఆధారాలు సేకరించి కోర్టు ముందు బలమైన సాక్ష్యాలు ఉంచడంతోపాటు కేసును నిందులు తప్పుదోవ పట్టించకుండా అనుక్షణం అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారన్నారు. ఏ మాత్రం రాజీ పడకుండా కోర్టులో తమ తరఫున వాదనలు వినిపించిన లాయర్ దర్శినం నర్సింహ సహకారం వల్లే తప్పు చేసిన వారికి న్యాయస్థానంలో శిక్ష తప్పదని రుజువైందన్నారు. భవిష్యత్‌లో పిల్లలతో అప్రమత్తంగా ఉండి, ఏవైనా ఘటనలు జరిగితే రాజీ మార్గం అనుసరించాలే తప్ప, కడుపుకోత మిగిల్చే హత్యలకు పాల్పడకూడదని ఆవేదన వ్యక్తం చేస్తూ పేర్కొన్నారు.

ప్రియుడు మోసం చేశాడని ఆత్మహత్య



రజిత(ఫైల్)

మర్రిగూడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్లుగా ప్రేమించిన వ్యక్తి మరో యువతితో పెళ్లికి సిద్ధమవడంతో ప్రియురాలు ఆత్మహత్యకు పాల్పడింది. సోమవారం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ కృష్ణారెడ్డి, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దామెర భీమనపల్లి గ్రామానికి చెందిన గొడ్డేటి నవీన్‌తో రాజగోని రజిత(21)కు ఇంటర్మీడియట్ చదివే సమయంలోనే పరిచయం ఏర్పడింది. అయితే వీరిద్దరూ మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే రజితను పెళ్లి చేసుకుంటానంటూ కాలం గడుపుతూ వచ్చాడు. ఇదే సమయంలో రజిత తమ ప్రేమగురించి తల్లిదండ్రులకు తెలిపింది. వారు వెళ్లి నవీన్ తల్లిదండ్రులు గొడ్డేటి లింగయ్య, యాదమ్మల వద్దపెళ్లి విషయాన్ని ప్రస్తావించారు. అయినప్పటికీ ఎటువంటి సమాధానం లేకపోగా నవీన్ వేరే యువతిని వివాహం చేసుకుంటున్నట్లు రజితకు తెలిసింది. దీంతో అతడిని నిలదీయగా తాను ప్రేమించలేదని, పెళ్లి చేసుకోనని తెగేసి చెప్పాడు. దీంతో ప్రేమించిన వ్యక్తి పెళ్లి చేసుకోకుండా నిరాకరించి మోసం చేశాడని మనస్తాపానికి గురైన రజిత ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కూలి పనులకు వెళ్లి వచ్చిన తల్లిదండ్రులు గమనించే సరికి రజిత మృతి చెందింది. రజిత తండ్రి రాజగోని నర్సింహ ఫిర్యాదు మేరకు నవీన్, ఆయన తల్లిదండ్రులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



నర్సింహ(ఫైల్)

భువనగిరి రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం బీఎన్‌తిమ్మాపూర్‌లో సోమవారం వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్‌హెచ్‌వో సంతోష్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పిన్నం నర్సింహ(65) అదే గ్రామానికి చెందిన జిన్న బాలరాజు, పిన్నం పెద్దకనకరాజుల మధ్య గొడవ జరుగుతుంది. కాగా ఆదివారం రాత్రి నర్సింహ పొలం వద్ద పడుకున్నాడు. కుటుంబసభ్యులు ఫోన్‌చేసినా ఎత్తలేదు. దీంతో భార్య పద్మ రాత్రి తొమ్మిది గంటలకు వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూసే సరికి మంచంపై నర్సింహ స్పృహ లేకుండా విగతజీవిగా పడిఉన్నాడు. వెంటనే 108అంబులెన్స్‌కు ఫోన్ చేయగా వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భువనగిరి ఏరియా ఆసుపత్రిలో సోమవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. అయితే నర్సింహ మృతికి గ్రామానికి చెందిన జిన్న బాలరాజు, పిన్నం పెద్దకనకరాజులు కారణమని నర్సింహ కుటుంబసభ్యులు జిన్న బాలరాజు ఇంటి వద్ద దాదాపు 15 నిమిషాల పాటు మృతదేహంతో నిరసన తెలిపారు. ఎస్‌హెచ్‌వో సంతోష్‌కుమార్, ఎస్‌ఐ సూర్యతేజతో వెళ్లి ఆందోళనకారులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. నర్సింహ కుమార్తె మానస ఫిర్యాదుమేరకు జిన్న బాలరాజు, పిన్నం పెద్దకనకరాజులపై కేసున మోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. నర్సింహకు భార్య,ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

వృద్ధురాలిపై గుర్తుతెలియని వ్యక్తి అత్యాచారయత్నం

భూదాన్‌పోచంపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జిబ్లక్‌పల్లి గ్రామానికి చెందిన 85 ఏళ్ల వృద్ధురాలిపై గుర్తుతెలియని వ్యక్తి అత్యాచారయత్నం చేశాడు. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 9న ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి వృద్ధురాలిపై అత్యాచారయత్నం చేయబోగా కేకలు వేయడంతో పారిపోయాడు.బాధితురాలి కోడలు ఫిర్యాదతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి



రేవల్లే లక్ష్మీ(ఫైల్)

నకిరేకల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నకిరేకల్ శివారులోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందింది. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శాలిగౌరారం మండలం అడ్లూరు గ్రామానికి చెందిన రేవల్లే రాంబాబు కుమారుడు రేవంత్‌కు తీవ్రంగా జ్వరం రావడంతో నకిరేకల్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి ఆటోలో బయలుదేరాడు. తనతో పాటు తల్లి రేవల్లే లక్ష్మి(65), భార్య పద్మ కూడా ఉన్నారు. చికిత్స అనంతరం ఆదివారం రాత్రి అడ్లూరు గ్రామానికి తిరుగు వెళ్తుండగా నెల్లిబండ సమీపంలో వెనుకనుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. రాంబాబు, పద్మ, రేవంత్‌కు తీవ్రగాయాలయ్యారు. రాం బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎదురెదురుగా వాహనాలు ఢీకొని...

గుండాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా గుండాల మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల వద్ద సోమవారం రాత్రి ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొట్టిన సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల ప్రకారం.. గుండాల నుంచి తుర్కలషాపురం వైపు వెళ్తున్న చిప్పలపల్లి శంకర్ వస్తాకొండూరు నుంచి గుండాల వైపు వస్తున్న సుంకరబోయిన మహేశ్ బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇరువురికి బలమైన గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో జనగాం ఏరియా ఆసుపత్రికి తరలించారు.మహేష్ మృతి చెందగా శంకర్ చికిత్స పొందుతున్నట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనంతో...

మునుగోడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలో సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం కచలాపురం గ్రామానికి చెందిన చిరగోని బాలమ్మ(58) కుమారుడు లింగస్వామితో కలిసి మండల కేంద్రంలో రేణుకఎల్లమ్మ ఫంక్షన్‌హాల్ పక్కన నివాసముంటూ గొర్రెలకాపరిగా జీవనం సాగిస్తోంది. ప్రతిరోజూ వెళ్తున్నట్టుగా గొర్రెల మేపటానికి ఉదయాన్నే బయలుదేరారు. బాలమ్మతో పాటు మునుగోడుకు చెందిన నారగోని నర్సింహ కూడా తన గొర్రెలను కాసుకుంటూ వెళ్తున్నారు. కమ్మగూడెం శివారులో మండలకేంద్రం నుంచి చొల్లేడు వైపున రోడ్డు బాలమ్మ నిలబడి గొర్రెల మేపుతున్న క్రమంలో కొరటికల్ వాగు ఇసుక రీచ్ నుంచి ఇసుక నింపుకొని వస్తున్న ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ దెండె మల్లేష్ వేగంగా బాలమ్మను ట్రాక్టర్‌తో ఢీకొట్టాడు. దీంతో కిందపడిపోయిన ఆమెపై నుంచి ట్రాక్టర్ చక్రాలు వెళ్లటంతో శరీర భాగాలు పూర్తిగా ధ్వంసమై ముద్దలుగా ఎగిరపడ్డాయి. దీంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. డ్రైవర్ అజాగ్రత్తగా ట్రాక్టర్‌ను నడపటంతోనే ప్రమాదం జరిగినట్లు పలువురు తెలిపారు. ఈమేరకు బాలమ్మ కుమారుడు లింగస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర హాస్పిటల్‌కు మృతదేహాన్ని తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముందున్న వాహనాన్ని ఢీకొట్టడంతో



కస్తాల శ్రావణ్(ఫైల్)

హుజూర్‌నగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ కౌన్సిలర్ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ కస్తాల శ్రావణ్(43) సోమవారం మధ్యాహ్నం ఇందిరాసెంటర్ నుంచి గాంధీపార్క్ వైపు వెళ్లే క్రమంలో ముందున్న మోటార్ సైకిల్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రావణ్ తీవ్రగాయాలు కాగా ఖమ్మం జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత మునిసిపల్ ఎన్నికల్లో 13వ వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ఆయన మృతికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, నాయకులు తన్నీరు మల్లికార్జున్ రావు, గల్లా వెంకటేశ్వర్లు, గెల్లి రవి, సంపత్‌రెడ్డి, దళిత సంఘాల నాయకులు నివాళులర్పించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నకిలీ డీఎస్పీ మోసం

సూర్యాపేట క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సినిమాల ప్రభావంతో పోలీస్ కావాలని కలలు కన్న ఓ వ్యక్తి పదో తరగతితోనే ఆ కల నెరకపోవడంతో వక్రమార్గం పట్టాడు. పోలీస్‌అధికారిలా యూనిఫాం, బెల్ట్‌బూట్లు, బ్యాడ్జీలు ధరించి డీఎస్పీనంటూ కారులో తిరుగుతూ ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసి జల్సా చేస్తున్న నకిలీడీఎస్పీని సూర్యాపేట జిల్లా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.18లక్షలు, కారు, పోలీస్ యూనిఫాంను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా పోలీస్ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎస్పీ కొత్తపల్లి నర్సింహ కేసు వివరాలను వెల్లడించారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి గ్రామానికి చెందిన బత్తుల శ్రీనివాసరావు ఫిబ్రవరిలో సూర్యాపేటలోని శ్రీగ్రాండ్ హోటల్‌కు వచ్చాడు. తాను డీఎస్పీనని, దురాజ్‌పల్లి(పెద్దగట్టు)జాతర బందోబస్తు పర్యవేక్షణకు వచ్చానని సిబ్బందిని పరిచయం చేసుకుని గదిని అద్దెకు తీసుకున్నారు. పోలీస్‌యూనిఫాంతో బయటికివెళ్లి వస్తున్నాడు. రెండు వారాల పాటు ఆయన వ్యవహారం బాగానే సాగింది. కొందరు హోటల్ గది వద్దకు వచ్చి డబ్బు విషయంలో శ్రీనివాసరావుతో వాగ్వాదానికి దిగారు. ఇలా రెండు, మూడు రోజులు కొనసాగడంతో హోటల్ సిబ్బందికి అనుమానం వచ్చి యజమానుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయాన్ని యజమానులు పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. సూర్యాపేట పట్టణ పోలీసులు హోటల్ వద్దకు సోమవారం ఉదయం చేరుకుని శ్రీనివాసరావును ప్రశ్నించారు. అతడు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హోటల్ వద్ద ఉన్న బాధితులను కూడా పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కొత్తపల్లి నర్సింహ, పక్కన అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు

పాత నేరస్థుడే..

పోలీసుల విచారణలో అతడు పాతనేరస్థుడని తేలింది. పౌరసరఫరాల శాఖ, పోలీస్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలువురి నుంచి రూ.లక్షల్లో వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి, త్రిపురాంతకం,మేడికొండూరు, నర్సరావుపేట రూరల్, మార్కాపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో పలువురు నిరుద్యోగుల నుంచి డబ్బు వసూలుచేసి మోసం చేయడంతో అక్కడి పోలీసులు కేసులు నమోదు చేసి అరెస్టు చేసి 2022లో జైలుకు పంపారు. అదే ఏడాది బెయిల్‌పై విడుదలైన తర్వాత తెలుగు రాష్ట్రాల్లో సంచరిస్తూ తాను డీఎస్పీనని ఆటోడ్రైవర్లు, హెయిర్‌డ్రెస్సింగ్ సెలూన్ల యజమానులను పరిచయం చేసుకున్నాడు. వీరి ద్వారా ఎస్‌ఐ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి కోదాడకు చెందిన ఓ యువతి నుంచి విడతల వారీగా రూ.36లక్షలు, కానిస్టేబుల్ ఉద్యోగం ఇప్పిస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మార్టూరుకు చెందిన యువకుడి నుంచి, జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని గురజాలకు చెందిన యువకుడికి నుంచి కొంతమొత్తంలో డబ్బులు వసూలు చేశాడు. వసూలు చేసిన డబ్బుతో లగ్జరీ కార్లను అద్దెకు తీసుకుని తిరుగుతూ జల్సాలు చేస్తున్నాడు. అతడు ఖర్చులు చేయగా మిగిలిన రూ.18లక్షలు, కారు, పోలీస్ యూనిఫాం, రెండుడమ్మీ మ్యాన్‌ప్యాక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు శ్రీనివాసరావుపై 2011లో మఠంపల్లి మండలంలో బైక్ చోరీ కేసు కూడా ఉందని ఎస్పీ తెలిపారు. శ్రీనివాసరావుకు వివాహంకాగా, ఓ కుమారుడు ఉన్నాడని తెలిపారు. కోదాడకు చెందిన యువతి ఫిర్యాదు మేరకు నకిలీ డీఎస్పీ శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చుతున్నట్లు తెలిపారు. నకిలీ డీఎస్పీని పట్టుకున్న సూర్యాపేట పట్టణ పోలీసులను అభినందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ మేక నాగేశ్వరరావు, సూర్యాపేట డీఎస్పీ గొల్లూరి రవి, ఇన్‌స్పెక్టర్ పి.వీరరాఘవులు, ఎస్‌ఐలు ఆంజనేయులు, ఈట సైదులు, సిబ్బంది విద్యాసాగర్ రావు, గొర్ల క్రిష్టయ్య, గోదేశి కర్ణాకర్, జోగు సైదులు, చీకూరి మధు ఉన్నారు.

సినిమాల ప్రభావంతో..

మఠంపల్లి: సినిమాల ప్రభావంతో సులభంగా డబ్బు సంపాదించి జల్సాలు చేయాలని చిన్నప్పటి నుంచే శ్రీనివాసరావు మక్కువ పెంచుకున్నాడని సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మట్టపల్లి గ్రామస్థులు తెలిపారు. 15 ఏళ్ల కిందట పోలీస్‌యూనిఫాం ధరించి మట్టపల్లి శివారులో లారీడ్రైవర్లను ఆపి డబ్బులు వసూలు చేయగా, నకిలీ పోలీసు అని తెలుసుకున్న లారీ డ్రైవర్లు ఆయనను చితకబాదారు. దీంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పరారైనట్లు గ్రామస్థులు తెలిపారు. మట్టపల్లిలో ఐదో తరగతి వరకు చదివిన శ్రీనివాసరావు ఇప్పటికే పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చాడని, బెయిల్‌పై బయటికి వచ్చిన ప్రతిసారి వేరే కొత్తప్రాంతానికి మకాం మార్చి పోలీస్ అధికారి పేరుతో డబ్బులు వసూలు చేయడం అతడి నైజం అని గ్రామస్థులు వివరించారు.

ఒడిషా నుంచి గంజాయి తరలిస్తూ అరెస్ట్

సూర్యాపేట క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని సూర్యాపేట జిల్లా మునగాల పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ.3లక్షల విలువైన 30కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను ఎస్పీ కొత్తపల్లి నర్సింహ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఒడిషా రాష్ట్రం కోరాపుట్ జిల్లా అంగోటుగూడ గ్రామానికి చెందిన సన్‌ఖిలా అలియాస్ శ్రీను వారి ప్రాంతంలో గంజాయి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. హైదరాబాద్‌లో గంజాయికి ధర ఎక్కువగా వస్తుందని తెలుసుకుని అక్కడ కూడా గంజాయిని కిలో రూ.15 వేలకు విక్రయించి సొమ్ము చేసుకోవాలనుకున్నాడు. ఒడిషా రాష్ట్రం కోరాపుట్ జిల్లా పుల్లికొండ గ్రామానికి చెందిన పూర్ణ వద్ద కిలో గంజాయిని రూ.1500ల చొప్పున మొత్తం 30కిలోలు కొనుగోలు చేశాడు. గంజాయిని ప్యాకెట్లుగా తయారు చేసి వాటిని తీసుకుని ఈ నెల 9న హైదరాబాద్‌కు వెళ్లేందుకు అక్కడ లారీ ఎక్కాడు. కాగా ఈ నెల 10న ఉదయం లారీ మునగాల మండలం సమీపంలోకి రాగానే డ్రైవర్ తాను హైదరాబాద్‌కు వెళ్లడంలేదని చెప్పడంతో గంజాయి ఉన్న బస్తాను తీసుకుని సన్‌ఖిలా రోడ్డుపక్కన చెట్ల పొదల్లో దాచి హైదరాబాద్ వెళ్లేందుకు వాహనాల కోసం వేచి చూస్తున్నాడు. ఆ సమయంలో పెట్రోలింగ్‌లో ఉన్న మునగాల పోలీసులు అతడిని విచారించగా గంజాయి విక్రయించేందుకు వెళ్తున్నట్లు చెప్పాడు. వెంటనే అతడి నుంచి 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అతడితో పాటు గంజాయిని విక్రయించిన పూర్ణపై కూడా కేసు నమోదుచేశారు. గంజాయి విలువ రూ.3లక్షలు ఉంటుందని ప్రస్తుతం సన్‌ఖిలాను మాత్రమే కోర్టుకు రిమాండ్‌కు పంపుతున్నామని, మిగిలిన నేరస్తుడు పూర్ణను త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు. గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న మునగాల పోలీసులను అభినందించడంతో పాటు వారికి రివార్డులు అందజేస్తామని ఎస్పీ తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, శివకోటేశ్వర్‌రావు, ఎల్లారెడ్డి, సతీష్, రాంబాబు తదితరులు ఉన్నారు.

ఇద్దరు దొంగలు..

అనంతగిరి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి చోరీలకు పాల్పడుతున్న వ్యక్తులను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం అనంతగిరి మండలం బొజ్జగూడెంతండా వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న క్రమంలో ఇటిక్యాల ఫణిచంద్, షేక్ నాగుల్ మీరా వాహనంపై అతివేగంతో వెళ్తున్నారు. అనుమానం వచ్చి విచారించగా దుర్గాపురం శివారులో వేలాద్రి ఇంట్లో ఒక ల్యాప్‌టాప్, రూ.18 వేల నగదు దొంగిలించామని వారు తెలిపారని ఎస్‌ఐ చెప్పారు. ఇద్దరిని అరెస్టు చేయగా, చోరీ కేసుకు సంబంధించి మరో నిందితుడు భానుప్రసాద్ పరారీలో ఉన్నాడని తెలిపారు. వారి వద్ద నుంచి ల్యాప్‌టాప్ దొంగతనానికి ఉపయోగించిన బైక్, రూ.18 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నారసింహుడికి చక్రతీర్థ స్నానం


స్వామివారి సేవ ముందు నృత్యం, వసంత కేళీలో అధికారులు, భక్తులు



యాద
గిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం పదో రోజుకు చేరుకున్నాయి. కొండపైన విష్ణు పుష్కరిణిలో సుదర్శనచక్ర ఆళ్వార్ల చక్రతీర్థ స్నానాలు, యాగశాలలో మహాపూర్ణాహుతి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. సాయంత్రం ఆలయంలో పుష్పయాగము, దేవతా ఉద్వాసము, రాత్రి వేళ దోపోత్సవ పర్వాలు ఆగమశాస్త్ర రీతిలో వైభవంగా కొనసాగాయి.
- (ఆంధ్రజ్యోతి,యాదగిరి గుట్ట)

» వసంతోత్సవ శోభతో వెల్లివిరిసిన యాదగిరిక్షేత్రం
» కొనసాగుతున్న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

విశ్వ రక్షకుడు నృసింహుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చేపట్టిన ప్రతి వేడుక మంగళ ప్రదమే. విశ్వశాంతి, లోకకల్యాణార్థం సదా పరమాత్ముడి ప్రార్థించుచూ భక్తజన కోటిని సంరక్షింపమని ఆహ్వానించిన 33వేల కోట్ల దేవతలను ఉత్సవ పరిసమాప్తిగా స్వస్తత చెందమని ఆయా దేవతల మంత్ర పఠనాలతో యజ్ఞహవిస్సును అందజేసి యాగ పరిసమాప్తి కోసం మహాపూర్ణాహుతి నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధానార్చక బృందం పాంచరాత్రగమ శాస్త్ర రీతిలో ఆలయ ఉత్తర తిరువీధి యాగశాలలో చతుస్థానార్చన పూజలు జరిపి వేదమంత్రాలతో మహాపూర్ణాహుతి నిర్వహించారు.

చక్రతీర్థ స్నానాలు (వసంతోత్సవ కేళి)

వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఉత్సవాంతముగా జరిపే పర్వం (చక్రతీర్థ అళ్వార్ల) చక్రతీర్థ మహోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. కల్యాణమూర్తులను దివ్యమనోహరముగా అలంకరించిన పూజారులు ఆయుధ రాజమైన సుదర్శన చక్రములను ప్రత్యేక పల్లకీ సేవలో వేదికపై తీర్చిదిద్దారు. ఉత్సవాలలో ప్రాధా న్యం గల చక్రతీర్థ స్నానంతో పాటు వైదిక కార్యక్రమాలు చేపట్టారు. తొలత పుణ్యవాచన పూజలు నిర్వహించిన పూజారులు వసంతకేళి జరిపారు. అనంతరం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్యచక్రత్ ఆళ్వర్ల అవబృత స్నాన ఘట్టాలు కొనసాగాయి. మంగళవాయిద్యాలు, మేళా తాళాల నడువ అత్యంత వైభవముగా అర్చకులు, అశేష భక్తజనులు, దేవస్థాన సిబ్బంది తిరువీధి సేవోత్సవంలో పసుపు, కుంకుమ, గంధం, వివిధ సుగంధాలు వెదజల్లే రంగుల్లో వసంత కేళి నిర్వహించారు. ఉత్సవాల్లో కలెక్టర్ ఎం. హనుమంతరావు దంపతులు, ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నర్సింహ మూర్తి, ఈవో ఏ. భాస్కర్‌రావు, డీఈవో దోర్బల భాస్కర శర్మ, ఏఈవోలు ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, జూశెట్టి క్రిష్ణ, గజ్వెల్లి రమేష్‌బాబు, రఘు, పర్యవేక్షకులు నాగుల మహేష్ గౌడ్, దీరావత్ రామరావునాయ క్,రాజన్‌బాబు, వెంకటేశ్వర్లు, నరేష్, రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ పుష్పయాగం, దోపోత్సవం

బ్రహ్మోత్సవాల్లో శ్రీవారికి నిర్వహించే ఉత్సవ వైశిష్ట్యమే శ్రీ పుష్పయాగం, దేవతోద్వాసన, దోపోత్సవం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ సర్వజగద్రక్షకుడైన మహావిష్ణు సుస్వరూపుడైన లక్ష్మీనృసింహుడిని వివిధ రకాల పూలతో సహస్రనామాలతో అర్చించే పర్వమే శ్రీ పుష్పయాగము. అతివృష్టి, అనావృష్టి, దుర్భిక్షములు కలగకుండా విశ్వమంత సుభిక్షంగా ఉండేందుకు శ్రీదేవి, భూదేవి సహితుడైన స్వామివారిని సకల విధ పుష్పరాజములతో పండితుల వేదమంత్ర పఠనాలు, అష్టవిధ రాగ తాళాలతో జరిపే పర్వమే శ్రీ పుష్పయాగము. మద్భాగవతములో గజేంద్రుడు అర్చించిన పుష్పార్చనల వైభవాలను తెలుపుతూ భగవంతుడిని వేడుకొను పుష్పయాగ ప్రక్రియ ఎంతో ఆనందభరితమైనది.

నేడు ఉత్సవాల పరిసమాప్తి

స్వామివారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం పరిసమాప్తమవుతాయి. ఉదయం 10 గంటలకు అష్టోత్తర శతఘటాభిషేకం, రాత్రి 9 గంటలకు స్వామి వారి శృంగార డోలోత్సవంతో 11 రోజులుగా అత్యంత వైభవంగా కొనసాగిన బ్రహ్మోత్సవాలు సమాప్తం అవుతాయి.

అలరించిన ధార్మిక, సాహిత్య, సంగీత సభలు

సోమవారం సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు లిటిల్ మ్యూజీషియన్స్ అకాడమి వ్యవస్థాపకుడు, ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు కోమాండూరి రామాచార్యులు శిష్య బృందం సినీ నేపథ్య గాయకుల భక్తి సంగీత విభావరి భక్తులను అలరించింది. అదేవిధంగా శ్రీవైష్ణవ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభాతబేరి నిర్వహించారు. శ్రీవైష్ణవులు, అర్చకులు, పారాయణీకులు సామూహికంగా విష్ణుసహస్ర నామ స్తోత్ర పారాయణాలు జరిపారు.

గవర్నర్ పర్యటన సాగిందిలా..



గవర్నర్ రోడ్డు మార్గంలో క్షేత్ర పర్యటనకు వచ్చారు. సుమారు గంట పాటు గవర్నర్ పర్యటన సాగింది. గవర్నర్‌కు ముందుగా కలెక్టర్ ఎం. హనుమంతరావు పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ప్రోటోకాల్ కార్యాలయం వద్ద పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అతిథి గృహం నుంచి ఎలక్ట్రికల్ వాహనంలో తూర్పు రాజగోపురం చేరుకున్నారు. త్రితల రాజగోపురం ద్వారా ఆలయంలోకి ప్రవేశించారు. ముందుగా క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామిని దర్శించుకోగా ఆలయ పూజారులు గవర్నర్‌కు పూర్ణకుంభ స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభువులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖ మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహ మూర్తి లడ్డు ప్రసాదం, ఈవో ఏ. భాస్కర్‌రావు స్వామివారి చిత్రపటం అందజేశారు. ఆలయ పశ్చిమ రాజగోపురం ద్వారా ప్రాకార మండపం లోపల తిరుమాడ వీధుల నుంచి త్రితల రాజగోపురం చేరుకొని అక్కడి స్వర్ణ దివ్య విమాన రాజగోపురాన్ని దర్శించుకున్నారు. తొడుగుల తయారీ తీరు వ్యయం, సమయం తదితర అంశాలపై కలెక్టర్ వివరించగా ఈవోను అభినందించారు.

మహా పూర్ణాహుతిలో పాల్గొనడం అదృష్టం : గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో నిర్వహించిన మహా పూర్ణాహుతిలో తాను పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. యాదగిరిగుట్ట క్షేత్ర సందర్శనకు సోమవారం వచ్చిన సందర్భంలో గర్భాలయంలోని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ఉత్తర తిరువీధిలోని యాగశాలలో జరిగిన మహాపూర్ణాహుతిలో పాల్గొని గవర్నర్ మాట్లాడారు. స్వామివారి దర్శించుకునేందుకు మరోసారి ఇక్కడే బస చేస్తానన్నారు. ఇంకొసారి క్షేత్ర పర్యటనకు వస్తున్నట్లు వివరించారు. స్వామివారి దర్శనం భాగ్యం కలగడం పూర్వ జన్మసుకృతమన్నారు.

పట్టు వస్త్రాల సమర్పణ ప్రోటోకాల్‌కు విరుద్ధమని బీఆర్ఎస్ ఆరోపణ

బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి కాంగ్రెస్ నాయకులు పట్టు వస్త్రాలు ఎలా సమర్పిస్తారని బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం నిరసన తెలిపాయి. ప్రోటోకాల్‌కు విరుద్ధంగా పట్టు వస్త్రాల ఎలా అందజేస్తారని టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి ఆరోపించారు. యాదగిరి కొండపై బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఈవో దృష్టికి పలు విషయాలు తెచ్చారు. ప్రోటోకాల్‌కు సంబంధం లేని వ్యక్తులతో స్వామివారికి పట్టువస్త్రాలు ఇప్పించారని ఈవోను నిలదీశారు. ఇలాంటి చర్యలతో మాజీ సీఎం కేసీఆర్ ఆనావాళ్లను చేరిపివేయలేరన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే సురక్ష సిబ్బందిని తొలగించారని ఆరోపించారు. దేవస్థానం తరపున ఆహ్వానాలు అందించిన విషయంలో గౌరవ మర్యాదలకు ఎలాంటి లోటు జరగలేదని ముఖాముఖి ఈవో భాస్కర్‌రావు వివరణ ఇచ్చారు. ప్రోటోకాల్ వర్తించని వ్యక్తులెవరు ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించలేదని, వ్యక్తిగతంగా తెచ్చిన పట్టువస్త్రాలు మాత్రమే స్వామికి అందజేశారని ఈవో తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, కసావు శ్రీనివాస్, గడ్డమీది రవీందర్, ఇమ్మిడి రాంరెడ్డి, బూడిద సురేందర్ పాల్గొన్నారు.


నిందితులను వాహనంలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని కోర్టుకు తరలిస్తున్న పోలీసులు


కోర్టు వద్ద నిందితుల కుటుంబ సభ్యులు

క్షణ క్షణం.. ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

నిందితుల కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. కొంత మంది శిక్షపడిన నిందితులకు చిన్న పిల్లలకు ఉండడంతో వారి కుటుంబ సభ్యులు ఉద్వేగానికిగురై కన్నీరు పెట్టుకున్నారు. ఇక కోర్టు తీర్పుతో ప్రణయ్ తల్లిదండ్రులకు కూడా భావోద్వేగానికి గురయ్యారు. హత్యకు గురైన కుమారుడిని గుర్తుచేసుకొని కంటతడి పెట్టుకున్నారు.

కోర్టు వద్ద రోజంతా కొనసాగిన ఉద్రిక్తత

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్య కేసుకి సంబంధించి ట్రయల్స్ ఈ నెల 7వ తేదీన ముగిశాయి. పదో తేదీన తుది తీర్పు వెలువరిస్తామని జడ్జి పేర్కొనడంతో, సోమవారం జిల్లా కోర్టు సముదాయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఇద్దరు డీఎస్పీలు, అయిదుగురు సీఐలతో పాటు పలువురు ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లతో కలిసి 150 మందితో బందోబస్తు నిర్వహించారు. కేసుకు సంబంధించిన నిందితుల్లో ఒకరైన అస్గర్ అలీ అంతర్జాతీయ ఉగ్రవాద ముఠాలతో సంబంధాలు కలిగి ఉండటంతో పాటు, గుజరాత్ రాష్ట్ర మాజీ హోంమంత్రి హీరేన్‌పాండ్యా హత్య కేసులో ముద్దాయి కావడంతో అతన్ని గుజరాత్ జైలు నుంచి ప్రత్యేక వాహనంలో తీసుకువచ్చారు. అదేవిధంగా ప్రధాన నిందితుడు సుభాష్‌శర్మ రెండు రోజుల క్రితం ట్రయల్స్‌కు హాజరైన తర్వాత చర్లపల్లి జైలుకు తరలించగా, సోమవారం తీర్పు వచ్చాక ఇతనికి ఉరి శిక్ష ఖరారవడంతో మళ్లీ అక్కడికే తరలించారు. మిగిలిన అయిదుగురు బెయిల్ మీద ఉండటంతో సోమవారం కోర్టుకు హాజరయ్యారు. సంచలన కేసు కావడం, నేరస్థుల పూర్వ చరిత్ర వివాదాస్పదంగా ఉండటంతో పోలీసులు అప్రమత్తమై భారీ బందోబస్తుని ఏర్పాటు చేశారు. అదేవిధంగా మీడియా ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, నిందితుల కుటుంబీకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో కోర్టు ప్రాంగణం కిక్కిరిసిపోయింది.


కోర్టు వద్ద పోలీసుల బందోబస్తు

కేసువిచారణ చురుకైనపాత్ర

ప్రణయ్ హత్యకేసు విచారణలో అప్పట్లో మిర్యాలగూడ డీఎస్పీగా పనిచేసిన శ్రీనివాస్ చురుకైన పాత్రపోషించారు. ప్రణయ్ హత్య కేసును ఖండిస్తూ ప్రజా, కులసంఘాల ఆందోళనలు ఓ వైపు, శాంతిభద్రతల పరిరక్షణ మరోవైపు, వీటికి తోడు కేసు విచారణ ఇలాంటి ప్రతికూల సవాళ్లను ఆయన చాకచక్యంగా ఎదుర్కొన్నారు. తన పనితనానికి తగ్గట్టు పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేసుకొని, హత్య జరిగిన ప్రదేశంలో లభ్యమైన ఆయుధం, ఆస్పత్రి సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా మొదలైన కేసు విచారణను కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే కొలిక్కితెచ్చారు. అప్పటి ఎస్పీ ఏవీ.రంగనాథ్ పర్యవేక్షణలో తొమ్మిది నెలలపాటు నిర్విరామంగా కేసు విచారణ కొనసాగించి సైంటిఫిక్, టెక్నికల్ వంటి మౌలిక ఆధారాలతో కూడిన 1,600 పేజీల చార్జిషీట్‌ను తయారు చేసి కోర్టుకు సమర్పించారు. ప్రణయ్ హత్యకేసులో నిందితుల పాత్రకు సంబంధించి బలమైన ఆధారాలను చార్జిషీట్‌లో దాఖలు చేయడంతో నిందితులు ఏ మాత్రం తప్పించుకునేందుకు వీలు లేకుండాపోయింది.

కోర్టు వద్ద ఉదయం నుంచి ఇలా..



- ఉదయం 8.30నుంచి అప్రమత్తమైన పోలీసులు
- 9.00: కోర్టు ప్రాంగణానికి చేరుకున్న పోలీసు అధికారులు, సిబ్బంది
- 10.00: కోర్టు ప్రాంగణాన్ని ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు
- 10.30: ఎవరినీ కోర్టులోకి అనుమతించని పోలీసులు
- 10.45: కోర్టుకు చేరుకున్న బెయిల్ పై ఉన్న నిందితులు
- 11.10: ఏ-3నిందితుడు అస్గర్ అలీని ప్రత్యేక పోలీసు వాహనంలో నల్లగొండ కోర్టుకు తీసుకువచ్చిన గుజరాత్ పోలీసులు
- 11.45: పోలీస్ ఎస్కార్ట్‌తో కోర్టుకు హాజరైన సుభాష్‌శర్మ
- 12.05: తీర్పును వెల్లడించిన జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్సీ ఎస్టీ కోర్టు న్యాయమూర్తి రోజా రమణి
- 1.10: తీర్పు తెలుసుకుని కోర్టు ప్రాంగణంలో కన్నీరు పెట్టిన కుటుంబసభ్యులు
- 1.10: శిక్ష పడిన నిందితులకు వైద్యపరీక్షలు
- 2.00 శిక్ష ఖరారు కావడంతో కోర్టు నుంచి జైలుకు తరలింపు
- 2.30: ఉరిశిక్ష పడిన సుభాష్‌శర్మ చర్లపల్లి జైలుకు తరలింపు
- 3.30: మిగతా నిందితులందరినీ నల్గొండ జైలుకు తరలింపు
- 3.40: నిందితులను తీసుకువెళ్లడంతో అక్కడి నుంచి వెళ్లిపోయిన కుటుంబసభ్యులు, ప్రజలు ప్రజాసంఘాల నాయకులు

ఆంధ్రజ్యోతి, నల్లగొండ క్రైం


పోలీస్ భద్రత నడుమ కోర్టుకు వస్తున్న న్యాయవాదులు


నల్లగొండ జిల్లా కోర్టు బయట సందడి

ప్రపంచ స్థాయి వైద్య కళాశాలగా ఎయిమ్స్

● పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి


వార్షికోత్సవాలను ప్రారంభిస్తున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, వికాస్ భాటియా

బీబీనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బీబీనగర్‌లోని అఖిలభారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) ప్రపంచ స్థాయి వైద్య కళాశాలగా రూపుదిద్దుకోనుందని పద్మభూషణ్ అవార్డు గ్రహీత, ఏఐజీ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఏయిమ్స్‌లో నిర్వహించిన 5వ వార్షికోత్సవాలకు ఆయనతో పాటు యూనిసెఫ్ ఇండియా చీఫ్ ఫీల్డ్ ఆఫీసర్ డాక్టర్ జలాలెమ్ బి.టపసే హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని ఏయిమ్స్ వైద్య కళాశాలలో కంటే బీబీనగర్ వైద్య కళాశాలలో ప్రపంచ స్థాయి మెరుగైన వైద్య సదుపాయాలు నైపుణ్యం గల వైద్యులు ప్రజలకు సేవలందిస్తుండడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో బీబీనగర్ ఎయిమ్స్ దేశంలోను అత్యుత్తమ వైద్య కళాశాలగా రూపాంతరం చెందుతోందన్నారు. ఆసుపత్రి ప్రారంభించిన 5సంవత్సరాలలో వివిధ విభాగాలలోని ఓపీడీ ద్వారా 11లక్షలకు పైగా రోగులకు పైగా చికిత్స అందించడం ఏయిమ్స్ వైద్యం పట్ల రోగులకు ఉన్న నమ్మకాన్ని సూచిస్తోందన్నారు. ఇప్పటికే క్యాంపస్‌లో 80శాతం వరకు భవన నిర్మాణాలు పూర్తయినట్టు డైరెక్టర్ వికాస్ భాటియా చెప్పారని, మరి కొన్ని రోజుల్లో ఏయిమ్స్‌లో పూర్తి స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి రాబోతున్నాయన్నారు. ఇది తెలంగాణ ప్రజలకు గొప్ప వరమన్నారు. ఏయిమ్స్‌లో వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు దేశం గర్వించే వైద్యులుగా తయారై తమ కలలను సాకారం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎంబీబీఎస్, బీఎస్సీ నర్సింగ్, ఫారా మెడికల్ విద్యార్థుల్లో ప్రతిభను కనబచిరిన విద్యార్థులందరికీ పథకాలు అందజేశారు. ఏయిమ్స్ రూపొందించిన ఇన్‌విక్టర్స్ 5వ ఎడిషన్ మేగజైను నాగేశ్వర్ రెడ్డి విడుదల చేశారు. అనంతరం వార్షికోత్సవాల సందర్భంగా ఎంబీబీఎస్, నర్సింగ్, ఫారా మెడికల్ విద్యార్థులు, అధ్యాపకులు, రెసిడెన్స్ డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లకు వివిధ ఇండోర్, ఔట్ డోర్ క్రీడలు నిర్వహించి విజేతలకు పథకాలు, ట్రోఫీలు అందజేశారు.

విధుల్లో చేరిన డీసీపీ అక్షాంశ్ యాదవ్



బాధ్యతలు స్వీకరిస్తున్న డీసీపీ అక్షాంశ్ యాదవ్

భువనగిరి టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాచకొండ పోలీస్ కమిషనరేట్ భువనగిరి జోన్ డీసీపీగా అక్షాంశ్‌యాదవ్ సోమవారం విధుల్లో చేరారు. ఇటీవలి వరకు డీసీపీగా విధులు నిర్వహించిన రాజేష్‌చంద్ర కామారెడ్డి జిల్లా ఎస్పీగా బదిలీ కావడంతో ఆయన స్థానంలో హైదరాబాద్ సెంట్రల్ జోన్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన చార్జీ తీసుకున్నారు. ముందుగా ఆయనకు జిల్లా పోలీస్ యంత్రాంగం సాదర స్వాగతం పలికారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం : ఎమ్మెల్యే



నీటిశుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రాధాన్యమివ్వనున్నట్లు ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నార్కట్‌పల్లి మండలంలోని ఏపీలింగోటంలో రూ.5 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి ఆలయంలో జరిగిన విగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాల నిర్మాణంతో ప్రజల్లో భక్తిభావం ఏర్పడుతుందని పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలు చల్లగా ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, నాయకులు బండ సాగర్‌రెడ్డి, శంకర్, దూదిమెట్ల సత్తయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, గాయం శ్యాంసుందర్‌రెడ్డి, గడ్డం పశుపతి పాల్గొన్నారు. ఏపీ లింగోటంలో జరిగిన పెద్దమ్మ తల్లి నూతన విగ్రహప్రతిష్ఠ పూజల్లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొన్నారు. ఆయన వెంట నాయకులు దుబ్బాక శ్రీధర్, నడింపల్లి నరేష్ ఉన్నారు.

రెండోరోజు కొనసాగిన కంటి వైద్య పరీక్షలు

నాంపల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరం రెండో రోజు కూడా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం 125 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 23 మందికి కంటి శస్త్రచికిత్సల కోసం వైద్యులు రిఫర్ చేసినట్లు తెలిపారు. వారిని త్వరలో కంటి శస్త్ర చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. మిగతా 102 మందికి కంటి అద్దాలను, మందులు అందజేశారు. పేదల కంటి సమస్యలను పరిష్కరించడానికి వైద్య శిబిరం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెద్దిరెడ్డి రాజు, నేతళ్ల కొండల్, బీరుదోజు యాదమ్మ, గాదెపాక నాగరాజు, వీరమల్ల సందీప్, కామిశెట్టి నాగరాజు, సుదర్శన చారి, పూల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

డీలర్లు సమయపాలన పాటించాలి



తిరుగండ్లపల్లిలో రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న రఘునందన్

మర్రిగూడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చౌక ధరల డీలర్లు సమయపాలన పాటించాలని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ అన్నారు. మండలంలోని పలు చౌక ధరల దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలల తరబడి సెలవుల్లో ఉండటానికి నిబంధనలు అంగీకరించవని పేర్కొన్నారు. కొందరు డీలర్లు సంవత్సరాల తరబడి సెలవుల్లో కొనసాగడం విస్మయం కలిగిస్తోందని అన్నారు. కొన్ని దుకాణాలకు రేషన్ సరుకులు చేరకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతీ నెలా 5వ తేదీలోపు సరుకులు దుకాణాలకు చేరుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ వెంకటేశ్వర్లు పలువురు ఉన్నారు.

వైద్య ఉద్యోగుల సేవలు మరువలేనివి



వైద్యాధికారి శ్వేతను సన్మానిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

శాలిగౌరారం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వైద్య ఉద్యోగుల సేవలు మరువలేనివని చేయూత నిద్దాం ఫౌండేషన్ చైర్మన్ కారుపాటి అంబేద్కర్ అన్నారు. మం డలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులను చే యూతనిద్దాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై పెరుగుతున్న దాడులను అరికట్టాలని అన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్వేత, ఆయుష్ వైద్యాధికారి వాసవి, పీహెచ్ఎన్ రాములమ్మ, సూపర్‌వైజర్లు మరియా, దయామణికి, స్టాఫ్‌నర్సు భవాని ఫౌండేషన్ సభ్యులు బట్ట రఘు, తాటిపాముల మోష, జనార్ధన్, శివ, సైదులు, అరవింద్, అజయ్, ఎడ్ల నవీన్ పాల్గొన్నారు.

● మర్రిగూడ: మహిళా దినోత్సవం సందర్భంగా ఎంఈవో కార్యాలయంలో మహిళా ఉపాధ్యాయులను గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ జ్ఞాన ప్రతిష్ఠాన్ లెర్నర్స్ రీసోర్స్ ఫౌండేషన్ సౌజన్యంతో సన్మానించారు. కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్, రాఘవేంద్ర, ఎంపీడీవో మున్నయ్య, ఎంఈవో బిట్టు శ్రీను, ఎంపీవో రవికుమార్, శ్రీనివాస్, లచ్చిరాం, బాలరాజు పాల్గొన్నారు.

వార్డు సమస్యలు పరిష్కరించాలి

చిట్యాల, మార్చి10, (ఆంధ్రజ్యోతి): చిట్యాల మునిసిపాలిటీలోని పదవ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ జిల్లా నాయకుడు చికిలంమెట్ల అశోక్ డిమాండ్ చేశారు. ఆ వార్డు ప్రజలు సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్ వీరేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ వార్డులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, రెండు, మూడు రోజులుగా మంచినీరు రావడం లేదన్నారు. రైస్‌మిల్లుల నుంచి బూడిద పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్, కన్నెబోయిన మహాలింగం, నాయకులు జయారపు రామకృష్ణ, పల్లె వెంకన్నగౌడ్, పాపవీవాసుదేవ్ పాల్గొన్నారు.

శివాలయంలో పదహారొద్దుల పండగ



శివాలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న భక్తులు

కేతేపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనుపాముల శివాలయంలో సోమవారం పదహారొద్దుల పండగ వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత నెల 27న మహా శివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణ వేడుకలను కన్నుల పండుగగా నిర్వహించారు. సోమవారం పదహారొద్దుల వేడుకను ఆలయ కమిటీ నిర్వహించి కల్యాణ వేడుకల తంతును ముగించింది. వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ తిరుగుడు జితేందర్, ఆలయ కమిటీ సలహాదారు బి.సంజీవరెడ్డి, ధర్మకర్తలు జాల శ్రీనివాస్‌రెడ్డిమాధవి, నర్సింహగౌడ్, రాము, ఆలయ పూజారి వావిలాల వేణుశర్మ, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ సంఘం జిల్లా అధ్యక్షుడిగా శంకర్



ఎలిజాల శంకర్

నల్లగొండ క్రైం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): చాకలి ఐలమ్మ సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎలిజాల శంకర్‌ను నియమించినట్లు సంఘం తెలంగాణ కో ఆర్డినేటర్ ఐతరాజు లక్ష్మణ్, ఫౌండర్, రచయిత ఐదారి, నాగిళ్ల శంకర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఐలమ్మ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఐలమ్మ చిత్రపటం, పుస్తకంతో పాటు నియమాకపత్రాన్ని అందజేసి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా చాకలి ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగిస్తూ ఆమె భావజాల స్ఫూర్తి వ్యాప్తికి పాటుపడాలని సూచించారు. జిల్లా కమిటీతో పాటు రానున్న రోజుల్లో అన్ని మండలాల కమిటీలను వేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు దూదిగామ నాగరాజు, బూతరాజు సైదులు, తుపాకుల ప్రవీణ్, ప్రసాద్, బూతరాజు గిరి, ప్రసాద్, యాదగిరి, పి.నరసింహ, దేవేందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేత

నల్లగొండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మిర్యాలగూడ రోడ్డు, ఫారెస్ట్ ఆఫీస్ రోడ్డు, శివాలయం ఏరియా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ వేణుగోపాలచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సర్టిఫికెట్లు ఎన్నిసార్లైనా తీసుకోవచ్చు

అవగాహన లోపంతో సమయం వృథా

చండూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న ధ్రువీకరణ పత్రాలు కొన్నింటిని తిరిగి తక్కువ సమయంలోనే పొందవచ్చు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు ప్రజలు అవగాహన కల్పించకపోవడంతో ప్రజలు సమయం, డబ్బు వృథా చేసుకుంటున్నారు. మీసేవా కేంద్రాల నిర్వాహకులు కూడా దరఖాస్తుదారులకు వివరించకపోవడంతో, వారి దందా మూడు పూవులు ఆరుకాయలుగా మారుతోంది. రెండు నెలల క్రితం ఓ ఇంటర్ విద్యార్థి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నాడు. తహసీల్దార్ కార్యాలయంలో తీసుకున్నాడు.



మీసేవ కేంద్రం

అయితే ఆ విద్యార్థి బస్సు ప్రయాణంలో పోగొట్టుకున్నాడు. వాటిని తిరిగి పొందడానికి కోసం మళ్లీ మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో అతనికి మూడు, నాలుగు రోజులు సమయం పట్టింది. అతనొక్కడే కాదు చాలా మంది ఇలానే తిరిగి దరఖాస్తు చేకుంటూ సమయం వృథా చేసుకుంటున్నారు.

రుసుం చెల్లించి పొందవచ్చు



ఒక వ్యక్తి ఆదాయ ధ్రువీకరణ పత్రం ఏడాదిలో ఒక్కసారి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. మొదటిసారి తీసుకున్న కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి దరఖాస్తు రశీదుపై అప్లికేషన్ నెంబర్ ఉంటుంది. తిరిగి అదే ధ్రువీకరణ పత్రం అవసరమైతే నేరుగా మీసేవా కేంద్రానికి వెళ్లి మొదటిసారి చేసిన దరఖాస్తు లేదా ఆధార్ నెంబర్ నమోదు చేయగానే గతంలో పొందిన ధ్రువీకరణ పత్రాల వివరాలు కంప్యూటర్ కనిపిస్తాయి. అప్పుడు చిరునామా, మొబైల్ ఫోన్ నెంబర్ నమోదు చేసి రూ.35 చెల్లిస్తే సరిపోతుంది. వెంటనే తిరిగి పత్రాలను తీసుకునే అవకాశం ఉంది.

– దశరథ, తహసీల్దార్, చండూరు

అవగాహనతో సమయం ఆదా

సాధారణంగా ఉపకార వేతనాలు, పలు రకాల దరఖాస్తుల కోసం ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా మారాయి. వాటి కోసం మీసేవా కేంద్రాల్లో కావాల్సిన పత్రాలను చూపించి దరఖాస్తు చేసుకోవాలి. అయితే ఈ పత్రాలు పోగొట్టుకున్నా లేదా వాటి ఒరిజినల్ పత్రాలను తిరిగి పొందాలన్నా కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. ఏడాదిలో ఎన్నిసార్లు అయినా మీసేవా కేంద్రాల్లో కేవలం కొద్ది నిమిషాల్లోనే వాటిని తిరిగి తీసుకునే అవకాశం ఉంది. ఈ అవకాశం చాలా మందికి తెలియక విద్యార్థులు, ప్రజలు వాటి కోసం మరలా తిరిగి దరఖాస్తు చేసుకుని కార్యాలయాల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. మీసేవా ఉన్నతాధికారులు ఒకసారి పొందిన పత్రాలను ఏడాదిలోపు ఎన్నిసార్లైనా రుసుం చెల్లించి తీసుకునే వెసులుబాటు కల్పించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మండలంలో పకడ్బందీగా 'పది' పరీక్షలు

నర్సింహ, ఎంఈవో, నార్కట్‌పల్లి



మండలంలో పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నట్లు ఎంఈవో నర్సింహ తెలిపారు. మండలంలో 608 మంది విద్యార్థులకు 5 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

● (నార్కట్‌పల్లి, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: ఈ విద్యా సంవత్సరంలో ఎంతమంది పదవ తరగతి పరీక్షలు రాయనున్నారు?

ఎంఈవో: మండలంలో మొత్తం 21 పాఠశాలలకు చెందిన 608 మంది విద్యార్థులు పది పరీక్షలకు రాయనున్నారు. వీటిలో 11 జడ్పీహెచ్ఎస్, 3 గురుకుల, 7 ప్రైవేటు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఎంఈవో: మండలంలో మొత్తం 5 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం. నార్కట్‌పల్లి, బీ.వెల్లెంల, అమ్మనబోలు, నార్కట్‌పల్లి పట్టణంలోని రెండు ప్రైవేట్ పాఠశాలలు ఎస్‌పీఆర్, శ్రీ చైతన్య పాఠశాలల్లో ఏర్పాటు చేశాం.

ఆంధ్రజ్యోతి: పరీక్ష కేంద్రాల వద్ద ఎంతమంది విధులు నిర్వర్తిస్తారు?

ఎంఈవో: ఐదు పరీక్షా కేంద్రాలకు గాను చీఫ్ కస్టోడియన్, కస్టోడియన్లు కలిపి మొత్తం 12మందితో పాటు 40మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వర్తించనున్నారు.

ఆంధ్రజ్యోతి: పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా?

ఎంఈవో: మండలంలోని అన్ని జడ్పీహెచ్ఎస్‌లలో పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. ఒక్కో విద్యార్థికి రూ.15లు చొప్పున ప్రభుత్వం విడుదల చేసిన డబ్బులతో ఉదయం సాయంత్రం స్నాక్స్ అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: వార్షిక పరీక్షలకు ముందు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించారా

ఎంఈవో: ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వార్షిక పరీక్షల కోసం విద్యార్థులను సన్నద్ధం చేశాం. ప్రీ ఫైనల్ పరీక్షలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ పర్యాయం ఆంగ్లం, గణితం సబ్జెక్టుల పరీక్షలకు ఓఎంఆర్ షీట్లను ఇచ్చాం.

ఆంధ్రజ్యోతి: ప్రశ్నా పత్రాలు మండలానికి చేరాయా?

ఎంఈవో: ఇప్పటికే మండలానికి పదవ తరగతి ప్రశ్నాపత్రాలు చేరాయి. ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి మళ్లీ మార్కుల విధానాన్నే తీసుకువచ్చింది.

సావిత్రీబాయి సేవలు చిరస్మరణీయం



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

నల్లగొండటౌన్, మార్చి 10: దేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా, సంఘసంస్కర్త, రచయిత్రిగా సావిత్రీబాయి పూలే చేసిన సేవలను చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో శుక్రవారం ఆమె వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యతోనే స్త్రీ విముక్తి సాధ్యమవుతుందని నమ్మి ఆమె తన భర్తతో కలిసి బాలికల పాఠశాలను ప్రారంభించినట్లు గుర్తు చేశారు. అలాంటి మహనీయురాలు అడుగుజాడల్లో నడిచి మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, సామాజికంగా చైతన్యం కావాలని కోరారు.

● బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహిళలు సావిత్రీబాయి అడుగుజాడల్లో నడుచుకుంటూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు కాసోజు విశ్వనాథం, సభ్యులు సోమమల్లయ్య, శంకర్‌ముదిరాజ్, రాములు, కోటప్ప, విజయ్, ఆదినారాయణ, చొల్లేటి రమేష్, సాయిబాబా, విశ్రాంత ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, గీత, లాలయ్య, నాగార్జున, దామోదర్, టీఎన్జీవోస్ అధ్యక్షుడు నాగిళ్ల మురళి, రఐదేవ్ తదితరులు పాల్గొన్నారు. బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బీపీ మండల్ విగ్రహం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు సింగం లక్ష్మి, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, నాయకులు మునాస ప్రసన్నకుమార్, వెంకటేశ్వర్లు, కోటియాదవ్, దుర్గా, సైదులు, శ్రీను, శ్రీనివాసచారి, రమేష్ పాల్గొన్నారు.



నల్లగొండలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ సెంటర్‌లో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుకరాజు సతీష్, జిల్లా ప్రధానకార్యదర్శి కల్లూరి సత్యనారాయణగౌడ్, నాయకులు కె.పర్వతాలు, లింగస్వామి, జనార్దన్ పాల్గొన్నారు.

బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్‌గౌడ్, బీసీ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కుల మల్లేష్‌యాదవ్, నాయకులు కారింగు నరేష్‌గౌడ్, యాదగిరి, కొంపెల్లి రామన్నగౌడ్, రమేష్‌గౌడ్, మహేశ్వరి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లిలో ఆసరా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆసరా సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ, అనిల్, గిరి, వేణు, పవన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

వైభవంగా తిరుమలనాథస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు

చిట్యాలరూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి శివారులో గుట్టపైన కొలువైన భూసమేత తిరుమలనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో హోమం చేపట్టారు. అనంతరం దేవతా మూర్తులను ఉత్సవ కమిటీ చైర్మన్ ఓర్సు రాజ్‌కుమార్ రథం మీదకు తీసుకువచ్చారు. దేవతామూర్తులను రథంపై నిలపగా సభ్యులు, భక్తులు రథాన్ని ముందుకు నడిపించారు. రథోత్సవంలో భక్తులందరూ రథానికి ఉన్న తాడును పట్టుకుని లాగారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వెండి కిరీటాలు బహుకరణ

భూసమేత తిరుమలనాథస్వామి స్వామివారికి పెద్దకాపర్తి జడ్పీహెచ్ఎస్‌కు చెందిన 1997-98 10వ తరగతి బ్యాచ్ పెద్దకాపర్తి, ఆరెగూడెంకు చెందిన పూర్వ విద్యార్థులు వెండి కిరీటాలను బహూకరించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ఓర్సు రాజ్‌కుమార్, పురోహితుడు సాగి శైలేంద్రశర్మ సమక్షంలో ఆలయ పురోహితుడు అంబరీష్‌కు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డాక్టర్ నూతి శ్రీను, సుధాకర్, ధనుంజయ, పురుషోత్తం, శ్రీను, స్వామి, శ్రీను, హరికృష్ణ, భాగ్యలక్ష్మి, అండాలు, స్వప్న, యశోద, అరుణ, సరిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ...



ఏపూర్‌లో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

చిట్యాలరూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏపూర్‌లోని ప్రాథమికోన్నత, పేరేపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా మారారు. వివిధ అధికారుల పాత్రలను పోషించి తమ ప్రతిభ చాటారు. తరగతి గదుల్లో విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వపరిపాల దినోత్సవంలో ఉపాధ్యాయులుగా మారిన చిన్నారులు

సంజయ్‌గాంధీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో...

నల్లగొండ క్రైం: జిల్లా కేంద్రంలోని పానగల్ ఫ్లైఓవర్ కింద ఉన్న సంజయ్‌గాంధీ నగర్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్.గోవిందమ్మ, ఉపాధ్యాయుడు ఎస్‌కే.జానీపాష, విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థులు, యువకులు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అనంతరెడ్డి

నల్లగొండ స్పోర్ట్స్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువకులు క్రీడల్లో రాణించాలని ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ గంట్ల అనంతరెడ్డి అన్నారు. కేకేఆర్ నల్లగొండ ఫుట్‌బాల్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించిన ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. క్రీడల్లో రాణిస్తే విద్య, ఉద్యోగాల్లో మంచి అవకాశాలు లభిస్తాయన్నారు. జిల్లాలో ఫుట్‌బాల్ క్రీడాకారులు చాలా మంది ఉన్నారని, వారందరికీ శిక్షణ ఇచ్చి పోటీల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలన్నారు. అనంతరం జరిగిన పోటీల్లో విజేతలకు పతకాలు, జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఫైనల్ మ్యాచ్‌లో నీలగిరి ఫుట్‌బాల్ జట్టు ప్రథమ, కేకేఆర్ అకాడమీ జట్టు ద్వితీయస్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో కార్యదర్శి కందికట్ల దాసు, ఓరుగంటి శ్రీను, హుస్సేన్, వెంకట్, డాక్టర్ పుల్లారావు, వెంకన్న, సుబ్బారావు, రజిత, సునిత, సాగర్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్ష ఫలితాలు వెల్లడి

నల్లగొండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు డీఈవో బిక్షపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 జనవరి నెలలో నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికెట్స్ కోర్సు పరీక్ష ఫలితాలు వెల్లడి కావడంతో వెబ్‌సైట్‌లో మార్కుల మెమోలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రూల్ నెంబర్ నమోదుతో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన సూచించారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

తెలంగాణ మోడల్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష 2025-26 గాను 6వ తరగతిలో ప్రవేశం కోసం, 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్ల ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థుల నుంచి ఈనెల 10 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

ఇంటర్ పరీక్షలో 331మంది గైర్హాజర్

నల్లగొండ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 13,136మంది విద్యార్థులకు గాను 12,805మంది హాజరు కాగా 331 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 11,109 మందికి 10,863మంది హాజరు కాగా, 246 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా ఒకేషనల్ విభాగంలో 2027మంది విద్యార్థులకు 1942మంది హాజరు కాగా, 85మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు.

'నేస్తం' లింగంగౌడ్‌కు సన్మానం

నార్కట్‌పల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): నేస్తం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు టీజీ లింగంగౌడ్‌ను హైదరాబాద్‌లోని ఆర్యభట్ట హైస్కూల్ యాజమాన్యం ఘనంగా సన్మానించింది. పేద విద్యార్థుల చదువుల కోసం 'నేస్తం' స్వచ్ఛంద సంస్థ పేరుతో లింగంగౌడ్ విశేష సేవలందిస్తున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా ప్రముఖ వర్ధమాన సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ సన్మానించారు. కార్యక్రమంలో గాయని నీహ, ఆర్యభట్ట స్కూల్ చైర్మన్ మాధురి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఇందిరమ్మ ఇళ్ల కోసం పంపిణీ చేయాలి

నార్కట్‌పల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను గుర్తించి పేదలకు ఇందిరమ్మ ఇళ్ల కోసం పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం చేపట్టిన ప్రజా సమస్యలపై పోరులో భాగంగా సోమవారం నార్కట్‌పల్లి మండలంలోని తొండ్లాయి, నార్కట్‌పల్లి తదితర గ్రామాల్లో పార్టీ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ప్రజలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న, నాయకులు కుమ్మరి శంకర్, ఆమనగంటి ఐలయ్య, దండు రవి, బొల్లెద్దు సైదులు రెడ్డిపల్లి రఘు, దండు నాగరాజు, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు సామగ్రి పంపిణీ

కట్టంగూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుఅన్నారం జడ్పీ హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ డైమండ్ నల్లగొండ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని అందజేశారు. పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పదో తరగతి వార్షిక పరీక్షలకు అవసరమయ్యే ప్యాడ్లు, పెన్నులు, కాంపాక్స్ బాక్స్‌లను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బీరం మోహన్‌రెడ్డి, హెచ్ఎం కందాల రమ, ఉపాధ్యాయులు చింతకాయల పుల్లయ్య పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
*** ఇఫ్తార్ : 6.30 | సహర్ : 5.05 (బుధవారం)
ANDHRAJYOTHY
నల్లగొండ

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.112	175	200
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.0 । కనిష్ఠం 20.4

నారసింహుడికి చక్రతీర్థ స్నానం

స్వామివారిని దర్శించుకున్న గవర్నర్



యాదగిరిగుట్ట ఆలయంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ● 7లో..

ప్రపంచ స్థాయి వైద్య కళాశాలగా ఎయిమ్స్

- పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి
- అట్టహాసంగా ఎయిమ్స్ ఐదో వార్షికోత్సవం



బీబీనగర్ ఎయిమ్స్ ఐదో వార్షికోత్సవంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ● 7లో..



నల్లగొండ కోర్టు వద్ద సందడి

క్షణ క్షణం ఉత్కంఠ

- ప్రణయ్ హత్యకేసులో నల్లగొండ కోర్టు సంచలన తీర్పు
- ప్రధాన నిందితుడు సుభాష్ శర్మకు మరణశిక్ష
- ఆరుగురికి జీవిత ఖైదు, జరిమానా ● కోర్టు వద్ద ఉద్రిక్తత
- శిక్ష పడిన నిందితుల కుటుంబ సభ్యుల కన్నీరు



ప్రణయ్ (ఫైల్)



మారుతీరావు (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ప్రణయ్ పరువు హత్య కేసు తుది తీర్పు సందర్భంగా సోమవారం నల్లగొండ కోర్టు వద్ద క్షణ క్షణం ఉత్కంఠ నెలకొంది. కోర్టు వద్ద నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహించారు. ఎవ్వరినీ కోర్టు సముదాయంలోకి అనుమతించని పోలీసులు కోర్టు వాయిదాలు ఉన్న వారిని మాత్రమే లోనికి పంపారు. పట్టణంతో పాటు మిర్యాలగూడ నుంచి వచ్చిన ప్రజలు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు, న్యాయవాదులతో కోర్టు ప్రాంగణం కిక్కిరిసింది. మీడియా ప్రతినిధులు సైతం పెద్ద సంఖ్యలో కోర్టు వద్దకు చేరుకోగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు ఉదయం 11.10 గంటలకు నిందితుల్లో ఒకడైన అస్గర్ అలీని నల్లగొండ కోర్టుకు తీసుకువచ్చారు. అనంతరం 11.50 గంటలకు ఏ-2గా ఉన్న సుభాష్ శర్మను కోర్టులో హాజరుపరిచారు. అప్పటికే ఇతర నిందితులు కూడా రాగా, మధ్యాహ్నం సమయంలోగా న్యాయమూర్తి తీర్పును వెలువరించారు. జీవిత ఖైదు శిక్ష పడినట్లు తెలియడంతో అక్కడికి వచ్చిన ● మిగతా 7వ పేజీలో..



రోదిస్తున్న శ్రవణ్ కుటుంబసభ్యులు

● పూర్తి వివరాలు ప్రధాన సంచిక 10లో..

కోర్టు తీర్పు కుల దురహంకారులకు చెంపపెట్టు

ప్రణయ్ తండ్రి పెరుమాళ్ల బాలస్వామి



నివాళులర్పిస్తున్న తల్లి ప్రేమలత, తండ్రి బాలస్వామి, సోదరుడు

మిర్యాలగూడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు ఇచ్చిన తీర్పు కుల దురహంకారులకు చెంపపెట్టు అని ప్రణయ్ తండ్రి పెరుమాళ్ల బాలస్వామి అన్నారు. సోమవారం ప్రణయ్ కేసు తీర్పు అనంతరం భార్య ప్రేమలత, చిన్న కుమారుడు అజయ్‌తో కలిసివెళ్లి ప్రణయ్ సమాధిపై పుష్పాంజలి ఘటించి కన్నీటిపర్యాంతమయ్యారు. అనంతరం ఇంటి వద్ద విలేకరులతో మాట్లాడుతూ, ఒక్క ప్రణయ్ కోసమే కాదు సమాజంలో మరెవరూ కులం, పరువు కోసం పిల్లలను, ఇతరుల పిల్లలను చంపడం లాంటి ఘటనలు - మిగతా 6వ పేజీలో...

నిందితుడు సుభాష్ శర్మకు మరణ శిక్ష : ఎస్పీ



నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ వన్‌టౌన్ పరిధిలో కులాంతర వివాహం చేసుకున్న కారణంగా హత్యకు గురైన ప్రణయ్ కేసులో నిందితులకు శిక్ష విధిస్తూ జిల్లా రెండో అదనపు ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి రోజారమణి తీర్పు ఇచ్చారని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2018 జనవరి 31న అమృత, ప్రణయ్‌లు కులాంతర వివాహం చేసుకోగా, అది నచ్చని ఆమె తండ్రి మారుతీరావు కిరాయి హంతకులకు సుపారీ ఇచ్చి ప్రణయ్‌ను హత్య చేసేందుకు ప్రణాళిక చేశారన్నారు. ఈ మేరకు 2018 సెప్టెంబరు 14న మిర్యాలగూడలోని ఓ ఆస్పత్రి వద్ద మాటు వేసిన నిందితుడు సుభాష్ శర్మ పదునైన కత్తితో ప్రణయ్‌పై దాడి చేసి...

- మిగతా 6వ పేజీలో...

అభ్యసన సామర్థ్యాలపై అధ్యయనం



- మూడు రోజులు 50 పాఠశాలల్లో
- రెండో తరగతి విద్యార్థుల సృజనాత్మకతను అంచనా వేసే లక్ష్యం

భువనగిరి టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగంతో పాటు అన్ని వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపిన కరోనా అనంతరం మొదటి బ్యాచ్‌గా పరిగణించే రెండో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు ఎన్‌సీఈఆర్‌టీ చేపట్టిన అధ్యయనం జిల్లాలో సోమవారం ప్రారంభమంది. జిల్లాలో ఎంపిక చేసిన 50 ప్రభుత్వ పాఠశాలల్లో మూడు రోజులపాటు ఈ సర్వే కొనసాగనుంది. ప్రాథమిక విద్యలోనే విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించి లోపాలను అధిగమించేలా ప్రణాళికల రూపకల్పనకు ఈ సర్వే వేదిక కానుంది. ఇప్పటికే అమలులో ఉన్న తొలిమెట్టులో భాగంగా ఈ సర్వే కొనసాగనుంది.

50 పాఠశాలలు

జిల్లాలో 484 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో రెండో తరగతి 3,018 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే సర్వే కోసం ఎన్‌సీఈఆర్‌టీ ప్రతీ జిల్లాలో 50 పాఠశాలలను ఎంపిక చేసింది. ప్రతి జిల్లాలో 50 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌ను అందుకు నియమించింది. ఈనెల 10, 11, 12వ తేదీల్లో సర్వే కొనసాగనుంది. ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన ప్రశ్నావళి ఆధారంగా ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్ రెండో తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేస్తారు. మీడియం ఆధారంగా తెలుగు, ఇంగ్లీష్ పుస్తకం చదవడం, రాయడం, అక్షరాలు, అంకెల గుర్తింపు, అవగాహన తదితర సామర్థ్యాలను అంచనా వేస్తారు. ప్రతీ పాఠశాలలో ఎనిమిది మంది విద్యార్థులను మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటారు. అంతకు తక్కువగా విద్యార్థులు ఉంటే అందరినీ సర్వే ఆధారంగా ప్రశ్నిస్తారు.

పకడ్బందీగా సర్వే



జిల్లాలో రెండో తరగతి విద్యార్థుల్లో సామర్థ్యాలను అంచనా వేసేందుకు చేపట్టిన సర్వే పకడ్బందీగా సాగుతోంది. విద్యార్థుల చదువు, గుర్తింపు, అవగాహన తదితర సామర్థ్యాలను ఈ సర్వే ద్వారా అంచనా వేస్తారు. సర్వేలో వెల్లడైన అంశాల ఆధారంగా విద్యాశాఖలో ఎన్‌సీఈఆర్‌టీ సంస్కరణలు, నూతన విధానాలను అమలు చేసే అవకాశం ఉంది. అయితే పిల్లలపై పెనుప్రభావం చూపుతున్న స్మార్ట్‌ఫోన్‌లను తల్లిదండ్రులు ఇవ్వకుంటే మంచిది.

- కె.సత్యనారాయణ, డీఈవో

సర్వేను జిల్లా విద్యాశాఖ పర్యవేక్షిస్తుంది. సోమవారం తెలుగు సామర్థ్యాల పరిశీలన పూర్తి కాగా, 11న ఆంగ్లం, 12న గణితం సర్వే కొనసాగనుంది.

సెల్ ఫోన్స్‌కు బానిసలుగా

బాల్యానికి సెల్ ఫోన్స్ సంకెళ్లుగా మారాయి. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు వీలున్నపుడల్లా సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడటం, ఇన్‌స్టా రీల్స్, యూట్యూబ్ షార్ట్స్ చూడటం పరిపాటిగా మారుతోంది. తల్లిదండ్రులు ఇంటిలో ఉన్న సమయం అంతా చిన్నపిల్లల చేతుల్లోనే ఫోన్లు ఉంటున్నాయి. పిల్లలు అన్నం తినాలన్నా, ఇంటి పనులకు ఆటంకం కలిగించవద్దన్నా, చివరికి వారికి ఆలనాపాలనా శ్రమ తప్పాలన్నా పిల్లలకు స్మార్ట్‌ఫోన్ ఇస్తే సరిపోతుంది అనే భావనలో కొందరు తల్లిదండ్రులు ఉంటున్నారు. అక్షరజ్ఞానం రాకముందే పిల్లలకు స్మార్ట్‌ఫోన్‌లో గేమ్స్ ఆడటం, కార్టూన్స్, రీల్స్ చూడటంపై అవగాహన వస్తుండటం పలు అనర్థాలకు కారణం అవుతోంది. ఈ నేపథ్యంలో రెండో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న సర్వేలో విద్యాసామర్థ్యాల సృజనాత్మకతపై అధికార వర్గాలలో ఆసక్తి నెలకొన్నది. అయితే పిల్లలు సెల్‌ఫోన్‌కు బానిస కావడానికి తల్లిదండ్రుల వైఖరే కారణమని, దీంతో పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

‘ప్రజావాణి’ ఫిర్యాదులను పరిష్కరించాలి: కలెక్టర్



సైకిళ్లు పంపిణీ చేసి ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ‘ప్రజావాణి’లో వచ్చిన ప్రజల ఫిర్యాదులను ఎప్పటికప్పుడూ పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ‘ప్రజావాణి’లో ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకొని మాట్లాడారు. జిల్లా స్థాయితో పాటు మండల, గ్రామ స్థాయి వరకు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించాలన్నారు. వ్యక్తిగత విషయాలకు సంబంధించినవి, భూములకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని వీటిపై ఫిర్యాదుదారులకు స్పష్టమైన వివరణ ఇవ్వాలన్నారు. ఒకవేళ పరిష్కారం కాకపోతే ఎందుకు కావడం లేదో తెలియజేయాలన్నారు. ‘ప్రజావాణి’కి జిల్లా అధికారులంతా తప్పక హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, ఇన్‌చార్జి డీఆర్వో అశోక్‌రెడ్డి,జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్ కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థినులు కష్టపడి చదవాలి...

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్): విద్యార్థినిలు కష్టపడి చదివి ఆర్థికంగా వారి కాళ్లపై వారు నిలబడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమకూర్చిన సైకిళ్లను కలెక్టర్ సోమవారం పంపిణీచేశారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఆర్‌పీ.రోడ్ బాలికల ఉన్నత పాఠశాల, బోయవాడ రామగిరి బాలికల ఉన్నతపాఠశాల, మాల్‌బౌలి పాఠశాలకు చెందిన 30మంది విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. నకిరేకల్‌కు చెందిన సరితకు పేపర్ ప్లేట్ల యూనిట్ ఏర్పాటుకు రూ.1.90లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఐటిపాముల బ్యాంకు ద్వారా వెంకన్న, మణెమ్మ అనే ఇద్దరు రైతులకు రూ.50లక్షల విలువైన రెండు హార్వెస్టర్లు అందజేశారు. అయిటిపాముల బ్యాంకు ద్వారా ఎనిమిది స్వయం సహాయక మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద రూ.1.50కోట్లు విలువైన చెక్కులు, బీసీ బాలికలు, మైనార్టీ హాస్టల్ విద్యార్థినులకు 20 శానిటరీ న్యాప్కిన్ ఇన్సిలేటర్లు అందజేశారు. దీంతోపాటు మరుగుదొడ్ల నిర్మాణానికి సీఎస్ఆర్ నిధుల ద్వారా చేపట్టేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందుకు వచ్చింది. కార్యక్రమంలో ఎస్‌బీఐ డీజీఎం వినోద్ కుమార్‌సిన్హా, రీజినల్ మేనేజర్ అలీముద్దీన్, చీఫ్ మేనేజర్ ఆంజనేయులు, జిల్లా ఎల్డీఎం శ్రామిక్, ఏపీడీ శారద, ఎంఈవో అరుంధతి, తదితరులు పాల్గొన్నారు.

‘గ్రీవెన్స్‌డే’తో సమస్యలకు పరిష్కారం

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



‘గ్రీవెన్స్‌డే’ ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ‘గ్రీవెన్స్‌డే’తో బాధితుల సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ‘గ్రీవెన్స్ డే’లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన 45 మంది అర్జీదారుల ఫిర్యాదులు తీసుకొని వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీస్‌శాఖను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా పోలీస్ అధికారులు కృషి చేయాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూసి వారిలో భరోసా కల్పించాలన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరిచి నిత్యం పర్యవేక్షిస్తామన్నారు. అదేవిధంగా పోలీస్ స్టేట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్, చలివేంద్రాన్ని ఎస్పీ ప్రారంభించారు. జిల్లా పోలీస్‌శాఖలో విధులు నిర్వహిస్తూ మృతిచెందిన పోలీస్, హోంగార్డుల కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐ సంతోష్, ఆర్ఎస్ఐ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పంటలు ఎండిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

- పెండింగ్ రుణమాఫీ, రైతు భరోసాను జమచేయాలి
- రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం



నెర్మట గ్రామంలో ఎండిన వరి పంటలను పరిశీలిస్తున్న శ్రీశైలం

చండూరురూరల్, మార్చి10(ఆంధ్రజ్యోతి): వరి పంట ఎండిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.30వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. చండూరు మండల పరిధిలోని నెర్మట గ్రామంలో సోమవారం ఆయన ఎండిన పొలాలను పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో సుమారు 20 మంది రైతుల పొలాలు బోర్లు అడుగంటి సాగు చేసిన పంట పూర్తిగా ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అప్పు చేసి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు గ్రామాలను సందర్శించి పంటలు, రైతుల వారీగా పరిశీలించి నష్టపరిహారం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఆయన కోరారు. వరికి ఎకరాకు రూ.30 వేలు, మిర్చి పంటకు రూ. 40వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న రైతు రుణమాఫీ, రైతు భరోసా నిధులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని అన్నారు. రైతులు అప్పు చేసి కష్టపడి పండించిన పంటలు చేతికొచ్చే సమయానికి నీళ్లు లేక ఎండిపోతుండటంతో ఆర్థికంగా, మానసికంగా కుంగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిలిచిపోయిన రుణమాఫీ, రైతు భరోసాను ఇవ్వాలని కోరారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా పార్లమెంట్‌లో చట్టం చేయాలని, వ్యవసాయ మార్కెట్ల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్కరణలను ఉపసంహరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు జెర్రిపోతుల ధనంజయ, రైతు సంఘం మండల, అధ్యక్ష కార్యదర్శులు కొత్తపల్లి నరసింహ, ఈరటి వెంకటయ్య, నాయకులు ఈరగట్ల నరసింహ, యాదయ్య, రాములమ్మ, బొమ్మరగోని నరసింహ, యాదయ్య, నారపాక నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పచ్చని మొక్కలకు నిప్పు

అగ్నికి ఆహుతైన హరితహారం మొక్కలు



రోడ్డు వెంట అగ్నికి ఆహుతి అయిన హరితహారం మొక్కలు

మర్రిగూడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్లకు ఇరువైపులా నాటిన చెట్లు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. మర్రిగూడ మండలంలోని తిరుగండ్లపల్లి నుంచి మాల్‌కు వెళ్లే రోడ్డు పక్కన హరితహారం పథకంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. వాటికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడం వల్ల సుమారు అర కిలోమీటర్ వరకు చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఇలాంటివి తరచూ సంఘటనలు జరుగుతున్నాయి. వేల రూపాయలు వెచ్చించి మొక్కలు నాటి పెంచినా నీడనిచ్చే చెట్లు ఇలాంటి సంఘటనలు జరిగి పూర్తిగా దహనమవుతున్నాయి. అధికారులు స్పందించి హరితహారం మొక్కలను పర్యవేక్షించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మూసీ ఎత్తిపోతల ద్వారా చెరువులు నింపాలి

కేతేపల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టుపై ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి మండలంలోని ఆయకట్టేతర గ్రామాల చెరువులు, కుంటలు నింపి రైతులకు సాగునీటిని అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు డిమాండ్ చేశారు. సీపీఎం చేపట్టిన ప్రజా సమస్యలపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండకిందిగూడెం గ్రామంలో ఆయన పర్యటించి ప్రజలు, రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక రైతుల కోరిక మేరకు గ్రామశివారు నుంచి వెళ్తున్న నీరు పారని ఏఎమ్మార్పీ కాల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూసీ ప్రాజెక్టు ఉన్నా మండలంలోని మెట్ట గ్రామాలైన గుడివాడ, ఇప్పలగూడెం, కొర్లపహాడ్, ఇనుపాముల, కొండకిందిగూడెం, బండపాలెంకు సాగునీరు అందని పరిస్థితి నెలకొందన్నారు. మూసీ ప్రాజెక్టుపై ఎత్తిపోతల పథకం ఏర్పాటుచేసి దీని ద్వారా ఆయా గ్రామాల చెరువులు, కుంటలు నింపాలన్నారు. అందుకు ఉద్యమిస్తామని తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళలను సన్మానిస్తున్న ఎంఈవో గోప్యానాయక్

డిండి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఎంఈవో గోప్యానాయక్ కోరారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను మండలకేంద్రంలోని మానవ వనరుల కేంద్రంలో ఎంఈవో గోప్యానాయక్ సోమవారం సన్మానించారు. మహిళలు పురుషులతో పోటీపడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నారాయణరెడ్డి, బాలరాజు, సత్యనారాయణ, రాజేందర్‌రెడ్డి, గొడుగు శ్రీనివాస్, తిరుపతయ్య, లక్ష్మయ్య, సరిత పాల్గొన్నారు.

రైతు సంఘం మండల కమిటీ ఎన్నిక





వెంకటయ్య, పద్మ

మిర్యాలగూడ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా గువ్వల వెంకటయ్య, ఎర్రబోతు పద్మ, ఉపాధ్యక్షుడిగా బంటు బుచ్చయ్య, సహాయ కార్యదర్శిగా కొమ్మరాజుల కృష్ణమ్మ, కోశాధికారిగా రామయ్య ఎన్నికయ్యారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేస్తామని నూతన అధ్యక్షకార్యదర్శులు తెలిపారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు.

గ్రామీణ తపాలా జీవిత బీమా పేదలకు వరం

హాలియా, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో తపాలా శాఖ తీసుకొచ్చిన జీవిత బీమా పేద, మధ్య తరగతి కుటుంబాలకు వరం లాంటిందని పోస్టాఫీసు అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఏఎస్‌పీ రాజా నర్సింహాగౌడ్ అన్నారు. మండలంలోని నాయుడుపాలెం గ్రామానికి చెందిన ముడావత్ జగన్‌నాయక్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా జగన్‌నాయక్ 11 నెలల క్రితం హజారీగూడెం గ్రామ తపాలా శాఖలో జీవిత బీమా చేశాడు. బీమా ద్వారా మంజూరైన రూ.8,30,470ల చెక్కును జగన్ భార్య పార్వతికి అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ నర్సింహారెడ్డి, బీపీఎమ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, మంచికంటి శ్రీనివాస్, ఏబీపీఎమ్ సయ్యద్ నుస్రత్‌రఫీ, గ్రామస్థులు షేక్ జలీల్‌పాష, వీర్రాజు, జానపాటి బుగ్గయ్య, సత్యనారాయణ, చిమట బాలసైదులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయం అభివృద్ధికి కృషి

హాలియా, మార్చి 10(ఆంధ్రజ్యోతి): హాలియా మున్సిపాలిటీలోని పార్వతీ సమేత జడల రామలింగేశ్వరస్వామి దేవస్థాన అభివృద్ధికి కృషి చేస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు అన్నారు. ఆలయంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. సవవేశంలో ఉజ్జా శ్రీహరి, పిల్లి తిరుపతయ్య, బందిలి పెదసైదులు, అంకిశెట్టి రమేష్, పల్‌రెడ్డి సత్యనారాయణరెడ్డి, మాధవరపు నరేందర్‌రావు, వర్కాల శ్రీనివాస్‌రెడ్డి, చిందే లక్ష్మణ్, కోట శ్రీనివాస్‌చౌదరి, గడ్డి నాగరాజు, గంజి సాంబయ్య, పుట్ట దుర్గారావు పాల్గొన్నారు.

ఆస్తి, నల్లా పన్నులు చెల్లించాలి

హాలియా, మార్చి 10(ఆంధ్రజ్యోతి): హాలియా మున్సిపాలిటీలోని గృహ యజమానులు ఇంటి, నల్లా పన్నులను చెల్లించాలని మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి తెలిపారు. ఆస్తి, నల్లా పన్నుల వసూళ్ల కోసం సోమవారం ప్రత్యేక బృందాలతో పన్నులు వసూలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్తి, నల్లా పన్నులను చెల్లించని పక్షంలోట నల్లా కనెక్షన్‌ను తొలగిస్తామన్నారు. ఆస్తిని జప్తు చేసి రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

హాలియా, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీయట్ పూర్తిచేసిన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని హాలియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఘన్ శ్యామ్ తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను డిగ్రీ కళాశాల అడ్మిషన్ల కోసం కళాశాలలో సోమవారం కరపత్రం విడుదల చేశారు. నాగార్జునసాగర్‌లోని, మహాత్మా జ్యోతిరావుపూలే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.యాదగిరి, సీహెచ్ రాజు, ఎస్.కె. గిరిబాబు, కొండ కృష్ణ, పి. రాంబాబు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో పోటీకి సిద్ధం కావాలి

డిండి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు తూం బుచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని రామంతపూర్ గ్రామంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు ఎండి. మైనొద్దిన్, నూనె వెంకటేశ్వర్లు, సొమిడి శ్రీనయ్య పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేత



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న క్రికెట్ అసోసియేషన్ సభ్యులు

మిర్యాలగూడ టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గోల్డ్ కప్ క్రికెట్ పోటీల విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడా పోటీలు స్నేహ బంధాన్ని పెంచుతాయన్నారు. టీ-20 లీగ్ కమ్ నాకౌట్ పోటీల్లో క్రీడాకారులు చక్కటి ప్రతిభ చూపించారన్నారు. కార్యక్రమంలో కోచ్ కావలి వెంకన్న, సంజీవరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, మణికంఠ, శివ, రామస్వామి, నరేందర్, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

మిర్యాలగూడ టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలను ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల చైర్మన్ మహ్మద్ నూరుద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులకు చిరుప్రాయంలోనే యోగా, ధ్యానం, వ్యాయామాల పట్ల ఆసక్తి కలిగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి అఖిల, హిమజ, ఐశ్వర్య, శాలిని, మాధవి, విజయ్‌కుమార్, చంద్రశేఖర్, రామకృష్ణ, షరీఫ్, రాణి, జ్యోతి, అండాలు, రమణ, లక్ష్మీ పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నిడమనూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పారం గ్రామంలో శాలివాహనుల కాలంలో నిర్మించిన ప్రాచీన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆరు రోజుల పాటు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. యజ్ఞాచార్యులు ప్రతాపురం మత్స్యగిరిస్వామి, వెంకటాచార్యులు, రామాచార్యుల పర్యవేక్షణలో సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమాలు గణపతి పూజ తదితర కార్యక్రమాలను వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారు చినకోవెల నుంచి పెదకోవేలకు చేరుకున్నారు. తొళక్కం, ద్రవిడ ప్రబంధ పారాయణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిగా శ్రవణ్‌కు అవకాశం కల్పించడం హర్షణీయం

డిండి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు శ్రవణ్‌కు అవకాశం కల్పించడం హర్షణీయమని విశ్వబ్రహ్మణసంఘం గౌరవ అధ్యక్షులు ఇడికుడ రాఘవచారి, అధ్యక్షులు ఎన్.నర్సింహచారి, ప్రధానకార్యదర్శి శ్రీరామదాసు మధు, ఉపాధ్యక్షులు చొల్లేటి కుమారస్వామి, కార్యదర్శి వంగాల రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మవిశ్వాసంతో విజయ తీరాలకు

● గ్రూప్-1లో ప్రతిభ చాటిన తిరుమలగిరి(సాగర్) మండల వాసులు ● ఒకే గ్రామం నుంచి ఇద్దరికి గ్రూప్-1 కొలువులు



నాగార్జున్‌రెడ్డి

తిరుమలగిరి(సాగర్), మార్చి 10(ఆంధ్రజ్యోతి): పట్టుదల, ఆత్మవిశ్వాసంతో రాష్ట్రస్థాయి ఉన్నత ఉద్యోగాల కోసం నిర్వహించే గ్రూప్-1 పరీక్షలో ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు అభ్యర్థులు ప్రతిభ కనబరిచారు. మండలంలోని బోయగూడెం గ్రామానికి చెందిన ప్రస్తుత హుజూర్‌నగర్ తహసీల్దార్ మందడి నాగార్జున్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో గ్రూప్-1లో 488మార్కులు సాధించాడు. మందడి భగవంతరెడ్డి జయమ్మల కుమారుడు నాగార్జున్‌రెడ్డి తన డిగ్రీ పూర్తయిన తరువాత డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించి టీచర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. టీచర్ వృత్తిలో ఉండగానే పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతూనే అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఉద్యోగాన్ని సాధించారు. అనంతరం 2012 గ్రూప్-2 పరీక్షలో 6వ జోన్‌లో 3వ ర్యాంకు సాధించి డిప్యూటీ తహసీల్దార్‌గా ఉద్యోగాన్ని పొందారు. ఈ క్రమంలో కేతేపల్లి, నిడమనూరు మండలాల్లో డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు



నిర్వహించారు. తహసీల్దార్‌గా పదోన్నతి పొంది నల్లగొండ తహసీల్దార్‌గా పనిచేయడంతోపాటు ప్రస్తుతం హుజూ ర్‌నగర్ మండలంలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వివిధ ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ తన లక్ష్యమైన గ్రూప్-1ను సాధించేందుకు నిర్విరామంగా కృషిచేస్తూ 2024లో నిర్వహించిన గ్రూప్-1 పరీక్ష రాశాడు. సోమవారం గ్రూప్-1 పరీక్షా ఫలితాలు రాగా రాష్ట్రస్థాయిలో 488మార్కులు పొందారు. ఈ క్రమంలో నాగార్జున్‌రెడ్డి ఆర్డీవో లేదా డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికయ్యే అవకాశముంది.

మూడు నెలల వ్యవధిలోనే రెండు ఉద్యోగాలకు



అల్లి కీర్తన

మండలంలోని బోయగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ అల్లి నాగమణి పెద్దిరాజుల కుమార్తె అల్లి కీర్తన మూడు నెలల వ్యవధిలో రెండు ఉద్యోగాలు సాధించి సోమవారం వెలువడిన గ్రూప్-1 పరీక్షా ఫలితాల్లో సైతం విజయం సాధించింది. 1నుంచి 10వ తరగతి వరకు హాలియాలోని వీఎస్ఆర్ పాఠశాలలో చదివిన కీర్తన, ఇంటర్మీడియట్ హైద్రాబాద్‌లోని శ్రీగాయత్రి కళాశాలలో, బి.టెక్ సివిల్ ఇంజనీరింగ్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తాడేపల్లిగూడేనికి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ)లో పూర్తి చేశారు. అనంతరం హైదరాబాద్‌లో సివిల్ సర్వీసెస్ పరీక్షలకు కోచింగ్ తీసుకోవడంతోపాటు గ్రూప్-1 పరీక్షకు కూడా సన్నద్ధమైంది. ఈ క్రమంలో 2024లో నిర్వహించిన గ్రూప్-4 పరీక్షలో మంచి మార్కులు సాధించి గత డిసెంబర్‌లో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని సాధించింది. అదేవిధంగా ఈ ఏడాది జనవరిలో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో జేటీవోగా ఎంపికయ్యారు. ప్రస్తుతం సోమవారం వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లో 462మార్కులు సాధించింది. ఈ సందర్భంగా ఒకే గ్రామం నుంచి గ్రూప్-1లో ఇద్దరు రాష్ట్రస్థాయిలో ఎంపిక కావడం పట్ల మండల వాసులు, గ్రామస్థులు, కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఆయకట్టు రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి : జూలకంటి

● మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



పాములపాడు గ్రామంలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మాడ్గులపల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మూసీ ఎడమకాల్వ పరిధిలోని ఆయ కట్టు రైతంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని పాములపాడు గ్రామంలో ఎండిపోతున్న వరిపంటను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మూసీ ప్రాజెక్టు కింద రైతులు ఎకరానికి రూ.40వేలకు పైగా పెట్టుబడులు పెట్టి పంటను సాగు చేశారని, అప్పులు తీసుకొచ్చి మరి సాగు చేసిన పంట చివరి దశలో నీరందక ఎండిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రాజె క్టుపైన అజమాయిషీ లేకపోవడం వల్ల నీళ్ల ఉన్నా చివరి భూములకు నీరందకపో వడంతో పంటలు నిలువునా ఎండిపోతున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఇరిగేషన్ అధికారులు స్పందించి సాగు నీటిని అందించాలని, ఇప్పటికే ఎండిపోయిన పంటలకు ఎకరానికి రూ.20వేల నష్ట పరిహారం అందించాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డబ్బికార్ మల్లేష్, పాదూరి గోవర్ధని, పాదూరి శశిధర్‌రెడ్డి, రొండి శ్రీనివాస్, పతాని శ్రీను, తంగెళ్ల నాగమణి, అయితగాని విష్ణు, శ్రీను, పిండి వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అల్లుబెల్లి వెంకట్‌రెడ్డి, గంగయ్యారావు, వెంకట్‌రెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

● దేవరకొండ ట్రాన్స్‌కో డీఈ విద్యాసాగర్



దేవరకొండ డివిజన్‌లో విద్యుత్ లోవోల్టేజీ సమస్య పరిష్కరించేందుకు అదనపు విద్యుత్ సబ్‌స్టేషన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసి కృషి చేస్తున్నట్లు దేవరకొండ డివిజన్ విద్యుత్‌శాఖ డీఈ విద్యాసాగర్ తెలిపారు. సోమవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు.

● (ఆంధ్రజ్యోతి -దేవరకొండ)

ఆంధ్రజ్యోతి: దేవరకొండ డివిజన్‌లో విద్యుత్ లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు?

డీఈ: దేవరకొండ పట్టణంతోపాటు డివిజన్‌లోని మండలాలు, గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: విద్యుత్ సబ్‌స్టేషన్‌ల ఏర్పాటు ప్రక్రియ పూర్తయిందా?

డీఈ: దేవరకొండ డివిజన్‌లో రూ.15 కోట్లతో గాజీనగర్, ఎల్లాపూర్, మేడారం, మల్లారెడ్డిపల్లి, కుర్మేడు, బొల్లారం గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నాం. టెండర్ ప్రక్రియ పూర్తయింది. త్వరలో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి.

ఆంధ్రజ్యోతి: మండలాలు, గ్రామాల్లో విద్యుత్ అధికారులు అందుబాటులో ఉండడంలేదన్న ఫిర్యాదుల మాటేమిటి?

డీఈ: మండలాల్లో ఏఈలు, గ్రామాల్లో లైన్‌మన్లు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుం టున్నారు. సమస్యలుంటే సమాచారం ఇవ్వాలి.

ఆంధ్రజ్యోతి: పొగిళ్ల, కంభాలపల్లి గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉన్నాయన్న ఫిర్యాదుల మాటేమిటి?

డీఈ: డివిజన్‌లో ఎక్కడ విద్యుత్ సమస్యలున్నా వెంటనే పరిష్కరిస్తు న్నాం. లోవోల్టేజీ సమస్యలున్నచోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లను మంజూరు చేసి వెంటనే సమస్యను పరిష్కరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: డివిజన్‌లో విద్యుత్ శాఖలో సిబ్బంది సరిపడా ఉన్నారా?

డీఈ: డివిజన్‌లోని విద్యుత్‌శాఖలో సిబ్బంది సరిపడా ఉన్నారు. ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

సావిత్రిబాయిపూలే ఆశయ సాధనకు కృషిచేయాలి



దేవరకొండలో సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దేవరకొండ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సామాజికవేత్త దివంగత సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు కృషిచేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో దేవరకొండలో సావిత్రిబాయిపూలే 128వ వర్ధంతి నిర్వహించి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళల విద్యాభివృద్ధికి సావిత్రిబాయిపూలే కృషి చేసిందన్నారు. దేశ మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా సావిత్రిబాయిపూలే విద్యార్థులకు విద్యను అందించి మహిళ హక్కుల కోసం పోరాడిందన్నారు. బీజేపీ ఓబీసీమోర్చ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి ఎస్సీమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకూరి నర్సింహ, నేతాళ్ల వెంకటేష్, వస్కుల సుధాకర్, గుండాల అంజయ్య యాదవ్, జల్దాభాస్కర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హాలియా: సావిత్రిబాయి పూలే జీవితం స్ఫూర్తిదాయకమని వీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మందా సైదులురావుగౌతమ్ అన్నారు. అనుముల మండలం నాయుడుపాలెం గ్రామంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు జీవితాంతం మహిళల అభివృద్ధికి సామాజిక చైతన్యానికి కృషి చేసిన గొప్ప మానవతావాది అని కొనియాడారు. కార్యక్రమంలో విశ్రాంత ఏఎస్ఐ యడవల్లి సోమశంకర్, రమావత్ చెన్నానాయక్, బిచ్యానాయక్, జాంపా, రమావత్ చాందీ, బాణావత్ రాజీ, భారతి, లలిత, పల్లీ, బూబి, బీచ్చీ, డేబారాణి, లక్ష్మి, పార్వతి, సోనీ, గాడి, జీజాబాయి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేసిన నిర్వాహకులు

త్రిపురారం మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థి మాజీ ఎంపీటీసీ అంబటి రాము సోమవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 44మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేల్స్ అందజేశారు. ఈ నెల 21వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఉన్నందున విద్యార్థులకు పరీక్ష సమాగ్రి అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు తరగతి పరీక్షలను మంచిగా రాసి అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రమావత్ రవినాయక్, లక్ష్మయ్య, రామారావు, శేఖర్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మల్టీలెవల్ మార్కెటింగ్‌తో మోసం

● వివరాలు వెల్లడించిన డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మల్టీలెవల్ మార్కెటింగ్ విధానంతో ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తిని నల్లగొండజిల్లా మిర్యాలగూడ పోలీసులు అరెస్టుచేశారు. సోమవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు కేసువివరాలు వెల్లడించారు. హన్మకొండకు చెందిన మోటపోతుల వెంకటేష్ ఇథిరియల్ ఎంపైర్ ఎల్ఎల్‌సీ పేరుతో సంస్థను ఏర్పాటుచేసి మోసాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. అయస్కాంత థెరపీ ఉత్పత్తులైన బ్రాస్‌లెట్లు, పరుపులు, దిండ్లను బహిరంగ మార్కెట్ ధరకంటే తక్కువ ధరకు తెచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. సంస్థ నిర్వాహకుడు వెంకటేష్ మాయమాటలకు ఆకర్షితులై వస్తువులను కొనుగోలు చేసిన ప్రజలు మోసపోయారు. దీనిపై పట్టణానికి చెందిన బొంగరాల సంజీవ్ అనే వ్యక్తి ఈనెల 4వ తేదీన వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు విచారణ ప్రారంభించామన్నారు. ఇథిరియల్ ఎంపైర్ ఎల్ఎల్‌సీ సంస్థలో చేరిన వినియోగదారులు రూ.9,945, రూ.16,500చెల్లించి చైన్‌సిస్టమ్ పథకంలో చేరాల్సి ఉంటుందన్నారు. సభ్యత్వ రుసుం చెల్లించి సంస్థలో చేరిన సభ్యులకు బ్రాస్‌లెట్లు, దిండ్లు, పరుపులిచ్చి ఐడీ ఇస్తారు. ప్రతిసభ్యుడు మరో ఇద్దరిని సభ్యులుగా చేర్పిస్తే కమీషన్ రూపంలో కొంత నగదును తమ ఖాతాలో జమచేస్తారు. ఈ పద్ధతిలో తొమ్మిదిమంది సభ్యులను చేర్పిస్తే స్కూటీ, 14మందిని చేర్పితే రూ.75వేలు వస్తాయని నమ్మించాడు. సభ్యులకు నాసిరకం వస్తువులు అంటగట్టి మోసాలకు పాల్పడుతున్నట్లు నిర్ధారణ జరిగిందని డీఎస్పీ తెలిపారు. ఈ తరహా మోసాలను నిందితుడు వెంకటేష్ సూర్యాపేట, నల్లగొండ, వరంగల్ జిల్లాలో సుమారు 600 మందిని సభ్యులుగా చేర్చుకొని ఒక్కొక్కరి నుంచి రూ.16,500 దండుకున్నట్లు గుర్తించామన్నారు. సుమారు రూ.99 లక్షల మేర నాసిరకం వస్తువులను సభ్యులకు అంటగట్టడంతోపాటు ఆర్థిక నేరాలకు పాల్పడ్డాడని, కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. ఇలాంటి నేరాలకు పాల్పడేవారి వివరాలు పోలీసులకు అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కేసును ఛేదించిన సీఐ నాగార్జున, ఎస్ఐలు సైదిరెడ్డి, పీసీ వీరబాబును డీఎస్పీ అభినందించారు.

13న పెసలు బహిరంగ వేలం

డిండి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): డిండి వ్యవసాయ విత్తనోత్పత్తి క్షేత్రంలో పండించిన 49 క్వింటాళ్ల పెసలును బహిరంగ వేలం వేస్తున్నట్లు వ్యవసాయశాఖ ఏడీ నివేదిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 యాసంగిలో పండించిన పెసలును కమిటీ సమక్షంలో ఈ నెల 13న ఉదయం 11.30 గంటలకు విత్తనోత్పత్తి క్షేత్రంలో వేలం వేస్తున్నట్లు తెలిపారు. రూ.10వేల నగదు దారవత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



చింతపల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టరాయినిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు సోమవారం స్వపరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయ పాత్ర పోషించి ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దేవేందర్ రావు, గోపి, మంజుల, రూప, దీప పుష్ప, విద్యార్థులు లహరి, యామజ, మౌనిక, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

చింతపల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం పొందవచ్చని ఎస్ఐ యాదయ్య తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో యువకులు ఏర్పాటు చేసిన వాలీబాల్, క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడారంగంలో రాణిస్తే గుర్తింపు ఉంటుందన్నారు.

రూరల్ ఎస్ఐగా లక్ష్మయ్య బాధ్యతల స్వీకరణ



మిర్యాలగూడ అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ రూరల్ ఎస్ఐగా మల్లికంటి లక్ష్మయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన పిల్లి లోకేష్‌కుమార్ మల్టీజోన్-2 ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీయగా, ఆయన స్థానంలో చౌటుప్పల్‌లో పనిచేస్తున్న లక్ష్మయ్య బదిలీపై ఇక్కడికి వచ్చారు. అక్రమ దందాలను అరికట్టడంతోపాటు శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు. బాధితులు మధ్య దళారీలను ఆశ్రయించకుండా నేరుగా పోలీసులను ఆశ్రయించి న్యాయం పొందాలని కోరారు.

భగవద్గీత పఠించాలి

చింతపల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠనం చేయాలని ఇస్కాన్ గురువు విష్ణుదాసు పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని గొడుకొండ్ల గోపాలస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేసి భగవద్గీతపై ప్రచారం చేశారు. పట్టణానికి చెందిన ప్రొద్దుటూరి దేవేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పూజారి వైద్యుల ప్రవీణ్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మాడ్గులపల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలో నూతనంగా ఏర్పాటైన ఎమ్మార్సీ భవనంలో ఖాళీగా ఉన్న ఒక అటెండర్ పోస్టుకు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయడానికి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో వెంకటమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుడు మాడ్గులపల్లి మండలానికి చెందినవాడై ఉండాలని, పదో తరగతి ఉత్తీర్ణుడై ఉండి 18 నుంచి 45 సంవత్సరాలలోపు వయస్సు ఉండాలని అన్నారు. దరఖాస్తుదారులు తమ బయోడేటా ఫాంతోపాటు ఆధార్‌కార్డు జిరాక్స్, 10వ తరగతి మెమో, పాప్ ఫోటోతో ఈనెల 12 నుంచి 15వ తేదీ లోపు స్థానిక ఎమ్మార్సీ భవనంలో సమర్పించాలని ఆయన సూచించారు.